
శనివారం 13 జూన్ 2026
https://www.telugudesam.org

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## కార్మిక సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మంత్రి వాసంశెట్టి సుభాష్

- వివరాలు 9 లో..




## ప్రజల నమ్మకాన్ని పొందాం...

# నిలబెట్టుకుంటాం

- పవన్‌కల్యాణ్ సహకారంతో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చింది
- ప్రధాని మోదీ చేయూతను మరువలేం
- కూటమిది పాజిటివ్ పాలిటిక్స్... గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్
- 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం దామినేడులో శుక్రవారం నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి-సంక్షేమం' విజయోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2024 ఎన్నికల తీర్పును ఒక విజయంగా కాకుండా రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు అప్పగించిన బాధ్యతగా భావిస్తూ పాలన సాగిస్తున్నామని ప్రకటించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి వెంటిలేటర్ మీద పడేస్తే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆక్సిజన్ అందించిందని, ప్రధాని మోదీ చేయూతను ఎన్నటికీ మరువలేమన్నారు. తాము పాలకులం కాదని, ప్రజల సేవకులమని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో, కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్ అండతో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు శ్రమిస్తున్నామని వివరించారు. రాబోయే రోజుల్లో ఏపీని 'స్వర్ణాంధ్ర 2047' దిశగా తీసుకెళ్లే బ్లూప్రింట్ తమ వద్ద ఉందన్నారు. కూటమిది పాజిటివ్ పాలిటిక్స్ అయితే గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్ అని వ్యాఖ్యానించారు.

2

## రప్పా రప్పా అంటే

# ప్రజలే రఫాడిస్తారు

వైసీపీ అధినేతపై మంత్రి లోకేష్ ఫైర్



కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేష్ అన్నారు. తిరుపతి సమీపంలోని దామినేడులో "రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి-సంక్షేమం" పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన వైసీపీ అధినేతపై నిప్పులు చెరిగారు. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. రప్పా రప్పా అంటే ప్రజలే రఫాడిస్తారన్నారు. వైసీపీ అరాచకాలను చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూ పోతుందని స్పష్టం చేశారు.

4

## వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం

- ఇందులో యువత భాగస్వాములు కావాలి
- విశాఖ 'డిజీ 100 ఎక్స్ ఏపీ' సదస్సులో మంత్రి నారా లోకేష్



"మారుతున్న గ్లోబల్ ట్రెండ్స్‌కు అనుగుణంగా కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వడం కాదు.. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా ఏపీ యువతను నైపుణ్య వనరులుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తనపై నిర్వహించిన ప్రతిష్టాత్మక "డిజీ 100 ఎక్స్ ఏపీ" సదస్సు ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'బ్రాండ్ సీబీఎన్', 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ల వల్లే దేశంలోకి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయన్నారు. ఆధునిక రంగాలకోసం విద్యార్థులను సన్నద్ధం చేయడానికి రాబోయే రెండువారాల్లో ప్రత్యేక'నైపుణ్య పోర్టల్' తీసుకువస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. యువత ఓటమికి కుంగిపోకుండా సరికొత్త ఆవిష్కరణలతో 'వికసిత్ భారత్' నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

5



## విమల విద్యాలయం పునరుజ్జీవంతో సాకారమైన ఉక్కునగర ప్రజల కల

- మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధి, పట్టుదలతో విద్యార్థులు, ఉపాధ్యాయ కుటుంబాల్లో కొత్త ఆశలు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

10

## ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం

- అధికార గర్వానికి వారు నేర్పిన గుణపాఠమే 2024 తీర్పు
- తిరుపతి సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- వివరాలు 8 లో..





## ఒమన్‌లో కూలిన

# కలల సౌధం...

విగతజీవుడిగా మారిన సురేష్

- ప్రవాసాంధ్ర పేజీలో...

చైతన్యరథం




# ప్రజల నమ్మకాన్ని పొందాం...

# నిలబెట్టుకుంటాం

- పవన్‌కల్యాణ్ సహకారంతో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ ఇచ్చింది
- ప్రధాని మోదీ చేయూతను మరువలేం
- మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధం
- కూటమిది పాజిటివ్ పాలిటిక్స్... గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్
- నాడు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారు... నేడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- రాజధానిపై మూడు ముక్కలాట... మావిగనో...? వాటికనో...?
- ఎమ్మెల్యేలు ప్రజా సేవకులే కానీ పెత్తందారులు కాదు
- ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టను... చర్యలుంటాయ్
- 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



తిరుపతి (చైతన్యరథం): 2024 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గెలుపుగా కాకుండా...బాధ్యతగా భావిస్తూ పాలన మొదలు పెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల్లో నమ్మకం కలిగిందని, దాన్ని నిలబెట్టుకునేలా పాలనకొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై చంద్రగిరి నియోజకవర్గం దామినేడులో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ సభకు చంద్రబాబు హాజరయ్యారు. రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం పేరుతో చేపట్టిన ఈ సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం వివరించారు. సుపరిపాలనలో భాగంగా అందిస్తున్న సేవలను సభా ముఖంగా తెలియజేశారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటున్న కేంద్రం, చేయూతనందిస్తున్న ప్రధాని మోదీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రెండేళ్ల కాలంలో డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిని వివరించడంతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇక ప్రజాప్రతినిధులు పెత్తందార్లుగా కాకుండా ప్రజా సేవకులుగా మెలగాలని సూచించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రధాని మోదీ,పవన్‌కల్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ఇచ్చిన పిలుపునకు మద్దతు పలికారు. 57శాతం ఓట్ షేర్‌తో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. 164 సీట్లతో ఎన్డీఏకు అధికారం కట్టబెట్టారు. 2024 ఫలితాలను గెలుపుగా కాకుండా రాష్ట్ర పునర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించాం. పాలకులుగా కాకుండా సేవకులుగా పని చేస్తున్నాం. అధికారం చేపట్టే సమయానికి అన్ని రంగాల్లోనూ సంక్షోభమే కాక వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. 2019లో ప్రజా వేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం రూ.10 లక్షల కోట్ల అప్పుతో ముగిసింది. కేంద్ర పథకాలను, సాగునీటి పథకాలను నిర్వీర్యం చేశారు. ఇన్వెస్టర్లను వెంటాడి వేటాడి తరిమేశారు. యువత భవిష్యత్తును దెబ్బతీశారు. ప్రశ్నించిన ప్రజలనూ వేధించారు. నన్ను అక్రమంగా జైల్లో పెట్టారు. పవన్ కల్యాణ్‌ను ఇబ్బందులుపెట్టారు. అయినా మేం కుంగిపోకుండా, వెనకడుగు వేయకుండా పనిచేసి ప్రజల కోసం నిలబడ్డాం. రాష్ట్ర దుస్థితిని చూసి భయపడకుండా ఏడు శ్వేతపత్రాలు విడుదల చేసి ప్రజలకు వాస్తవ విషయాలు తెలియచేసాం. ప్రజలు చూపిన విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కారు గెలిచింది. రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు విజ్ఞత చూపారు. ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టాం. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## గత ప్రభుత్వంలో ఎన్నో అవకాశాలను పోగొట్టుకున్నాం

"2019-24 మధ్య కాలంలో ఏపీ అవకాశాల్ని పోగొట్టుకుంది. విధ్వంసాన్ని సరిచేసేందుకు ఒక్కో అడుగూ ముందుకు వేస్తున్నాం. ప్రజల సేవకు పునరంకితం కావడానికే ఈ విజయోత్సవ సభ నిర్వహించుకుంటున్నాం. విమర్శలకు ఆధారాలతో సహా సమాధానం చెప్పే గుండె ధైర్యం ఎన్డీఏ ప్రభుత్వానికే ఉంది. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం. ఇచ్చినట్టే పాలన అందిస్తున్నాం. సూపర్ సిక్స్‌తో పాటు మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని చూరగొన్నాం. 'ఎన్టీఆర్ భరోసా' ద్వారా రూ.65వేల కోట్ల పెన్షన్లు ఇస్తున్నాం. 'తల్లికి వందనం' ద్వారా చిన్నారులకు చదువు చెప్పిస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా 71కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించాం. 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్రంతో కలిసి రూ.20వేలను ప్రతి రైతుకూ అందించాం. ధాన్యం కొనుగోళ్ల డబ్బులను 24 గంటల్లోనే చెల్లిస్తున్నాం. గీత కార్మికులు, వడ్డెర్లు, అర్చకులు, ఇమామ్‌లు, మౌజన్లు... ఇలా అందరినీ గుర్తుపెట్టుకుని మరీ సంక్షేమం అందిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలు సహా అందరికీ సబ్సిడీపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం.

పీ4 ద్వారా సమాజంలో జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. విద్యం, వైద్యానికి ప్రాధాన్యమిస్తూ సంజీవని ప్రాజెక్టు చేపట్టాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్లను కూడా నియమించాం. ఉద్యోగులకు 23 నెలల్లో రూ.21వేల కోట్ల బకాయిలు చెల్లించాం. అప్పులు చేసే వ్యక్తికి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టిన వ్యక్తికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. ఎమ్మార్వో ఆఫీసు, ఆస్పత్రి, మద్యంలపై వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టుపెట్టారు. యావత్తు రాష్ట్రాన్నీ తాకట్టు పెట్టిన వ్యక్తికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత ఉందా..? మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడిన వ్యక్తులకు ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా అన్ని జిల్లాలను, అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. గత పాలకుల హయాంలో పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి పారిపోయారు.

ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించి పెట్టుబడులు, ప్రాజెక్టులు సాధిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారాపరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. వివిధ పారిశ్రామిక పాలసీల ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పించాం. అందుకే పెట్టుబడులు వస్తున్నాయి. రాయలసీమలోని పుట్టపర్తిలో 5వ జనరేషన్ ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లోనే అనుమతులిచ్చాం. రాయలసీమ ఇక హార్టీ కల్చర్ హబ్. ఇక్కడికే స్పేస్, డ్రోన్, డిఫెన్సు పరిశ్రమలు వస్తున్నాయి. తిరుపతి జిల్లాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ ఏర్పాటు అవుతోంది. కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గని నుంచి తవ్వకాలు ప్రారంభమవుతాయి. గత పాలకులు చేసిన విధ్వంసం నుంచి ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబడుతున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఆక్సిజన్ అందించింది. ఏపీని అగ్రస్థానంలో...అందరికీ ఆదర్శంగా నిలిపేందుకు అంతా కలిసి కృషిచేయాలి." అని చంద్రబాబు సూచించారు.

## అభివృద్ధి చేస్తుంటే... అడుగడుగునా అడ్డుకుంటున్నారు

"రాయలసీమ ప్రాంతంలోని వివిధ ఖనిజాల ద్వారా వేర్వేరు పరిశ్రమలు వస్తాయి. 100 రోజుల్లోనే హంద్రీ-నీవా పూర్తిచేసి కుప్పానికి నీళ్లు తెచ్చాం. కల్యాణి డ్యామ్ కూడా పూర్తిచేసి శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వద్దకు నీళ్లు తెస్తాం. గత పాలకులు తిరుమల ప్రసాదాన్ని

- (మిగతా వివరాలు 3లో)






# ప్రజల నమ్మకాన్ని పొందాం... నిలబెట్టుకుంటాం

(2వ పేజీ తరువాయి)

కల్తీ చేసి అపవిత్రం చేశారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల అపచారం చేసి మన అందరి మనోభావాలను దెబ్బ తీసేలా గొడ్డలి పార్టీ ప్రవర్తించింది. తిరుమల జోలికి బ్రిటీషర్లు కూడా వెళ్లలేదు. కానీ గొడ్డలి పార్టీ ఆ దుర్మార్గం చేసింది. ప్రజలకు న్యాయం చేయాలన్నదే జనసేన–టీడీపీ–బీజేపీ లక్ష్యం. విశాఖకు, గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీలు వస్తే అమ రావతికి క్వాంటం వ్యాలీవస్తోంది. ఏపీకి పరిశ్రమలు రావాలి... మన రాష్ట్రం పురోగతి సాధించాలి. మన యువతకు ఉద్యోగాలు రావాలి. అందుకే పరిశ్రమలకు అవసర మైన నైపుణ్యాలను కూడా మన యువతకు కల్పిస్తు న్నాం. జిల్లాలను అడ్డగోలుగా విభజించారు. దానిని సరిచేసి మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాల ను ఏర్పాటు చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రీసర్వే ప్రక్రియ ద్వారా భూ వివాదాలకు చెక్ పెడుతున్నాం. భూ రికార్డులను ప్రక్షాళన చేసేలా ఈ కార్యక్రమం చేపడుతున్నాం. దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామంలో భూవివాదాలకు చెక్‌పెట్టాం. చెత్తపన్ను రద్దు చేయడంతోపాటు రాష్ట్రంలో చెత్తను, పరిపాలనలో చెత్తనుకూడా తొలగిస్తున్నాం. పరిపాలన కు అడ్డంకులు కల్పించే కొన్ని పాత చట్టాలను రద్దు చేసి పాలనా సమర్ధత పెంచుతున్నాం. విద్యుత్ ఛార్జీ లు పెంచలేదు. తొలిసారి ట్రూడౌన్ చేసి విద్యుత్ ఛార్జీలు తగ్గించాం. రూ.4,668కోట్ల భారాన్ని ప్రజల పై మోపకుండా ప్రభుత్వమే భరించింది. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2047 స్వర్ణాంధ్ర దిశగా ఏపీ ముందుకెళ్తుంటే గొడ్డలి పార్టీ వెనక్కులాగే





ప్రయత్నం చేస్తోంది. పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటుంటే ఆ పార్టీ లేనిపోని దుష్ప్రచారం చేస్తోం ది. గొడ్డలి పార్టీ ఫేక్ న్యూస్‌తో విష ప్రచారాలు చేస్తోంది. మద్య నిషేధం చేసి ఓటు అడుగుతానన్న వ్యక్తి ఏం చేశారో అందరికీ తెలుసు. జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారు. మహిళల మంగళసూత్రా లు తెంచారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి అధికారంలో ఎన్నివారాలు ఉన్నారో అందరికీతెలుసు. జాబ్ క్యాలెండర్ అని ఘనంగా ప్రకటించి ఒక్కసారి కూడా విడుదల చేయలేకపోయింది గొడ్డలి పార్టీ. అమరావతిపై ఊసరవెల్లి రాజకీయాలు చేశారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారు... అది మావిగనో వాటికనో..? వైసీపీ ఫేక్ న్యూస్‌ను నమ్ము కుంటే... మేం ప్రజలను నమ్ముకున్నాం. ఫ్రస్ట్రేషన్‌తో గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. కూటమిది పాజిటివ్ పాలిటిక్స్...గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్. ప్రజా ప్రభుత్వానికి ప్రజలే ఫస్ట్, దేశం– రాష్ట్రమే కూటమి అజెండా. దేశంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉంటేనే అభివృద్ధి ఆటోమేటిగ్గా జరుగుతుంది. తాము పెత్తందార్లు కాదు, ప్రజలకు సేవకులమనే విషయాన్ని ప్రతి ఒక్క ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలి. ఎన్డీఏ కూటమి పై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. రాష్ట్రాభి వృద్ధికి ఓ బ్లూ ప్రింట్ మన దగ్గర ఉంది. రెండేళ్ల క్రితం ఇదే రోజు సుపరిపాలనలో ఓ హంబుల్ బిగినింగ్ చేశాం. మేనిఫెస్టో అమలుపై చర్చించడానికి నాతో పాటు ఎన్డీఏ కూటమిలోని ప్రతీ కార్యకర్తా సిద్ధమే. నా దేశం–నా బాధ్యత అనే ఆలోచనతోనే మనమంతా పని చేయాలి. ప్రజా ప్రభుత్వం అనుక్షణం ప్రజల గురించే ఆలోచిస్తుంది. అభివృద్ధికి, సుపరిపాలనకు పునరంకితం అయ్యేలా సంకల్పం తీసుకుందాం. త్వరలోనే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించిన ట్రాక్ రికార్డు ప్రజా ప్రభుత్వానిది... విధ్వంసం చేసిన రికార్డు గొడ్డలి పార్టీది."అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు.

## దేశానికి దిశానిర్దేశంలా మోదీ 12ఏళ్ల పాలన

"రాష్ట్రానికి కేంద్రం సహకారం అందిస్తోంది. పోల వరం, అమరావతి, విశాఖ స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్ సహా వివిధ అంశాల్లో కేంద్రం అండగా నిలిచింది. ప్రధానిగా 12ఏళ్లపాలన పూర్తి చేసుకున్న నరేంద్ర మోదీకి అభినందనలు. ఆయన హయాం దేశాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేలా చేసింది.. భవిష్యత్తుకు పునాదులు వేసింది. వరుసగా మూడు సార్లు మోదీకి మద్దతుగా నిలవడంవల్లే దేశం అభి వృద్ధిలో ముందుకెళ్తోంది. 25కోట్ల మంది పేదలకు పేదరికం నుంచి విముక్తికల్పించిననేత ప్రధాని మోదీ. 1.46లక్షల కిలోమీటర్ల జాతీయ రహదారులు, 160 ఎయిర్‌పోర్టులు నిర్మించారు.చంద్రయాన్, గగన్‌యాన్ లాంటి ప్రాజెక్టులు దేశప్రతిష్టను పెంచాయి.'ఆపరేషన్ సింధూర్' మన సైనిక శక్తిని ప్రపంచానికి చాటింది. పశ్చిమాసియాలో యుద్ధంతో రకరకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధాని మోదీ చేపట్టిన చర్యల కార ణంగా అతి తక్కువ ద్రవ్యోల్బణం కలిగిన దేశంగా భారత్ ఉంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాం

రెండేళ్ల పాలన విజయోత్సవ సభ సందర్భంగా వివిధ పథకాల లబ్ధదారులు తాము పొందిన లబ్ధిని సభా వేదికపై నుంచి నుంచి వివరించారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా తాను పొందిన లబ్ధిని, తన అనుభవాన్ని ఉష అనే యువతి వివరించింది. ప్రకృతి వ్యవసాయంతో తనకు కలిగిన మేలును చంద్రబాబు అనే రైతు చెప్పారు. తన ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ అయ్యాయని.. చక్కగా చదువుకుంటున్నారని లబ్ధిదారు పులిచర్ల నాగమ్మ సంతోషంగా చెప్పింది తనకు కూటమి ప్రభుత్వం ఇల్లు ఇచ్చిందని నాగమ్మ వెల్లడించింది. రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. రెండేళ్ల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, ప్రాంతాల వారీగా జరిగిన అభివృద్ధి అద్దంపట్టేలా వీడియోను రూపొందించారు. కేంద్రం అందించిన సాయాన్ని... ప్రధాని మోదీ అందిస్తున్న సహకారాన్ని వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎలా పని చేస్తున్నారనే విషయాలను క్రోడికరిస్తూ వీడియో రూపకల్పన చేశారు.

సభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







# రప్పా రప్పా అంటే ప్రజలే రప్పాడిస్తారు

- చిన్నప్పుడు టీచర్లు కొట్టారనే కోపంతోనే జగన్ వాళ్లపై కక్షగట్టాడు
- ఆయన తెచ్చిన కంపెనీలు ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్
- డీఎస్సీ విషయంలో జగన్ చేస్తున్న ఆరోపణలు అంబేద్కర్ రాజ్యాంగంపైన
- జగన్ పేరులో ఉన్న జీ అంటే జెన్‌జీ కాదు... గొడ్డలి, విధ్వంసమే ఆయన అజెండా
- డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు
- రూ.లక్ష కోట్లతో 'మిషన్ రాయలసీమ' ప్రాజెక్టు
- కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభలో మంత్రి నారా లోకేష్

తిరుపతి (చైతన్యరథం): రాయలసీమను 'రాయల్' సీమగా మార్చడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యం. లక్ష కోట్లతో చేపట్టబోయే మిషన్ రాయలసీమ ప్రాజెక్టు దేశానికే ఆదర్శం కాబోతోంది అని రాష్ట్ర విద్య, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం దామినేడులో నిర్వహించిన విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 'రాయల్ ఎన్‌ఫీల్డ్, క్యారియర్, ఎల్‌జీ, రిలయన్స్ సీమకే వచ్చాయి. ఇది రాయలసీమపై మాకున్న నిబద్ధత. టీడీపీ, జనసేన, బీజేపీ... మనది పెద్ద కుటుంబం. రాష్ట్రం కోసం, ప్రజల కోసం అందరూ కలిసి పనిచేయాలి. ఇగోలు వద్దు, ఏదైనా సమస్య ఉంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. కూటమి ధర్మాన్ని అందరూ పాటించాలి. అహంకారం వద్దు... అహంకారం వల్లే వాళ్లకి 151-11 అయ్యాయి. ప్రజల్లోకి చేసిన, చేస్తున్న మంచి పనులు చెబుతామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రశాంతంగా జనం

కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకుంది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు ప్రశాంతత వచ్చింది. దాడులు లేవు, జేసీబీలు, కబ్జాలు, హత్యలు, బెదిరింపులు, బూతులు కూడా లేవు. రాష్ట్రంలో ఉన్నది ఒక్కటే ప్రశాంతత.ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది... ప్రశాంతంగా ఉన్నారు. తిరుపతి వచ్చిన తర్వాత నాకు ఒక విషయం గుర్తొచ్చింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే చంద్రగిరి గడ్డపై నేను ఒక మాట చెప్పాను. వెంకన్న చాలా పవర్ ఫుల్... అయనతో పెట్టుకోవద్దు... మాడి మసైపోతావు అని జగన్‌కి చెప్పాను. ఆయనకి అర్థం కాలేదు.. డైరెక్ట్‌గా స్వామితోనే పెట్టుకున్నారు. 2024లో ఏం జరిగిందో మీరంతా చూశారు. విశ్వ విఖ్యాత నట సార్వభౌమ





నందమూరి తారక రామారావుకి సీమ అంటే ప్రేమ. రాయలసీమకు కరువు వస్తే జోలె పట్టి ప్రజలను ఆదుకుంది ఎన్టీఆర్. తెలుగు గంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులను రూపకల్పన చేశారాయన. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు, పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం, 50 హార్స్ పవర్ విద్యుత్, తిరుమలలో నిత్యాన్నదానంలను ప్రారంభించిందీ ఆయనే.

## ప్రజలే వారిని రప్పాడిస్తారు...

2019 నుంచి 2024 వరకు గొడ్డలి పార్టీ అరాచక పరిపాలనను మనం చూశాం. బీసీ బిడ్డ అమర్‌నాథ్ గౌడ్‌పై పెట్రోలు పోసి చంపేశారు. దళిత వైద్యుడు సుధాకర్‌పై పిచ్చోడని ముద్ర వేసి చంపేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపేసి డోర్ డెలివరీ చేశారు. అబ్దుల్ సలామ్ కుటుంబంతో సామూహికంగా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. కుటుంబాన్ని విడిచి మిస్త్రా ఆత్మహత్య చేసుకునేలా చేశారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామన్నారు... ప్రజలే వాళ్ల జెండా పీకేశారు. వైనాట్ 175 అన్నారు. అందుకు ప్రతిగా టీమ్11 ఇచ్చారు. వాళ్లు సిద్ధం అంటే... ప్రజలు యుద్ధం అన్నారు. మమ్మల్ని అసెంబ్లీలో అడుగు పెట్టనివ్వమన్నారు, ప్రజలే వాళ్లని అసెంబ్లీలో అడుగు పెట్టకుండా చేశారు. ఇప్పుడు రప్పా రప్పా అంటున్నారు... ప్రజలే రప్పాడిస్తారు.

## రాజకీయాల్లో విరాట్ కోహ్లీ 'సీబీఎన్'

రాజకీయాల్లో విరాట్ కోహ్లీ మన సీబీఎన్. అవతలవైపు బౌలర్లు మారతారు తప్ప ఇటువైపు ఒకే ఒక్క బ్యాట్స్‌మన్ సీబీఎన్. అటువైపు బౌలర్ ఎవరైనా ఇటు సూపర్ సిక్స్ కొట్టేది మాత్రం మన సీబీఎన్నే. రాయలసీమను రాయల్ సీమగా మార్చేసింది మన సీబీఎన్. అప్పుడు కియా...ఇప్పుడు రాయల్ ఎన్‌ఫీల్డ్. డ్రిప్ ఇరిగేషన్‌తో సీమలో బంగారం పండేలా చేసింది మన సీబీఎన్. హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా కుప్పానికి నీళ్లు ఇచ్చింది మన సీబీఎన్. పులివెందులకు కూడా నీళ్లు ఇచ్చింది మన సీబీఎన్. ఇప్పుడు లక్ష కోట్లతో మిషన్ రాయలసీమ స్టార్ట్ చేస్తున్నదీ మన సీబీఎన్.

## రెండేళ్లుగా సుపరిపాలన అందించాం

ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సుపరిపాలన అందించాం. అన్నీ చేసేశామని కాలర్ ఎగరేయట్లేదు. ఆర్థిక ఇబ్బందులున్నా దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. రూ. 2వేల పెన్షన్‌ను ఒకేసారి రూ. 4వేలకు పెంచాం. అన్నా క్యాంటీన్లు, డీఎస్సీ ద్వారా 16,347 టీచర్, 6వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశాం. ఇప్పుడు జాబ్ క్యాలెండర్ ద్వారా 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అదే విధంగా చేనేతలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాం. ఆటోవాలా సేవలో, మత్స్యకార సేవలో, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి ఉచిత బస్సు, దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేత, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' వంటివి అమలు చేస్తూ జనరంజక పాలన అందిస్తున్నాం.

## జగన్ పేరులో జీ అంటే గొడ్డలి

ప్రజా ప్రభుత్వ నినాదం ఒక్కటే. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ. దేశంలోకి వచ్చిన ప్రతి వందలో 25శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కే వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి బడా సంస్థలు ఉత్తరాంధ్రకు క్యూ కట్టాయి. రాజధాని ప్రాంతంలో ప్రతిష్టాత్మకమైన క్వాంటం వ్యాలీ ఆవిష్కృతమవుతోంది. రాయలసీమకు ఎవరూ ఊహించని విధంగా ఫైటర్ జెట్స్ పరిశ్రమను, రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను రప్పించాం. మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్ జెట్స్... వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా... వాళ్లది కిడ్నాప్. మనది విశ్వసనీయత... వాళ్లది నేరం. మనది అభివృద్ధి... వాళ్లది విధ్వంసం. మనది బుల్లెట్... వాళ్లవి బూతులు... మనది మహిళలకు 33% రిజర్వేషన్ ... వాళ్లది సొంత తల్లిని, చెల్లిని గెంటేయడం. జగన్ అనే పేరులో ఉన్న జీని జెన్‌జీ అనుకుంటున్నారు. కానీ జగన్‌లో ఉన్న జీ అంటే గొడ్డలి.

## ఆయనకు సీసీడీ జబ్బు ఉంది

జగన్‌కి సీసీడీ అనే జబ్బు ఉంది. సీసీడీ అంటే క్రెడిట్ చోరీ డిజార్డర్. మేము కష్టపడి గూగుల్ తీసుకువస్తే... ప్రెస్‌మీట్ పెట్టి వాళ్ల వల్లనే గూగుల్ వచ్చిందన్నారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కి వస్తుంది అని పేపర్‌లో వస్తే.. రావడం లేదు అని ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. దాని భూమి పూజ తర్వాత నేనే తెచ్చాను అని ప్రెస్‌మీట్ పెట్టి మాట తప్పాడు, మడమ తిప్పాడు. ఇంకా కొంచెం టైమ్ ఇస్తే ఆగస్టు 15న ప్రెస్‌మీట్ పెట్టి భారత దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది మా తాతే అని కూడా ప్రకటిస్తాడు సీసీడీ జగన్. ఆయన తెచ్చిన కంపెనీలు కొన్ని ఉన్నాయి.... అవి ఆంధ్రా గోల్డ్, ప్రెసిడెంట్ మెడల్, గోల్డ్ మెడల్.

## అపట్లో టీచర్లు కొట్టారనే జగన్‌కు కోపం

చిన్నప్పుడు 10వ తరగతి పేపర్ లీక్‌లో దొరికితే వాళ్ల టీచర్లు జగన్‌ను చితగ్గొట్టారు. అందుకే ఆయనకి టీచర్లంటే కోపం. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన చరిత్ర జగన్‌ది. మెగా డీఎస్సీని అడ్డుకోడానికి 226 కేసులు వేశారు. 150 రోజుల్లో మనం మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 పోస్టులు భర్తీ చేశాం. ఇందులో ఏదో జరిగిందని బురద జల్లుతున్నారు. ఈ విషయంలో జగన్ నన్ను, సీబీఎన్‌ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించట్లేదు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తున్నారు. రిజర్వేషన్లను ప్రశ్నిస్తున్నారు. జగన్ మీరు ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరు. నేను పాదయాత్రలో ఇచ్చిన హామీని మీ నిలబెట్టుకున్నాను. జగన్‌కి కనీసం దేశం భక్తి కూడా లేదు. మేము సాగర్ డిఫెన్స్ కంపెనీ తీసుకొస్తే దాని మీద కూడా నకిలీ ప్రచారం చేశారు. సాగర్ రక్షణ సంస్థ దేశ రక్షణ కోసం బోట్లు తయారు చేస్తుంది. కనీసం 1000 మంది మత్స్యకార పిల్లలకు ఉద్యోగాలు కల్పించేందుకు సాగర్ సంస్థను మేము తీసుకొస్తే అనేక ఆరోపణలు చేసి ఆ కంపెనీని కూడా తరిమేయాలని ప్రయత్నించారు.

## స్టీల్ ప్లాంట్‌ను కాపాడిన చరిత్ర ఎన్టీయేది

ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడుతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇబ్బందుల్లో ఉంటే రెండు సార్లు కాపాడిన చరిత్ర ఎన్డీయేది. స్టీల్ ప్లాంట్ క్లోజ్ చేసి అక్కడ రాజధాని కడదామనే ఆలోచన మీది. మొన్న స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం జరిగింది. కొంత మంది కార్మికులు చనిపోయారు. చనిపోయిన పర్మినెంట్ ఉద్యోగి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం రూ.2 కోట్లు ఇస్తుంది. కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి ఒక కోటి ఇస్తుంది. అంతే కాకుండా పర్మినెంట్ జాబ్ ఇస్తున్నాము. ఎవరైనా ఎక్కువ ఇవ్వమని అడగొచ్చు. కానీ జగన్ కోటి ఇవ్వమని డిమాండ్ చేశారు.

## 'నమో' వల్లే మనకు గౌరవం

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా మనకి గౌరవం దక్కుతోంది. ప్రపంచం మొత్తం మన దేశంవైపే చూస్తోంది. దానికి కారణం మన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ. ఆయన రికార్డులను బద్దలుకొట్టడం ఎవరికీ సాధ్యంకాదు. దేశం మొత్తం నమో అంటే నరేంద్ర మోదీ. ఏపీలో మాత్రం నమో అంటే నాయుడుజీ, మోదీజీ. అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్లు ఉన్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉంది. విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరానికి నిధులు, ఫైటర్ జెట్, AMCA ప్రాజెక్టు వచ్చాయి. త్వరలో కర్నూలుకి హైకోర్టు బెంచ్ తీసుకురాబోతున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.



# వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం

- నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది
- సుసంపన్న భవిష్యత్తు కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలి
- ఏపీలో నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత
- స్పీడ్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఏపీ ప్రత్యేకతలు
- యువతకు అవకాశాల కల్పనలో ఏపీతో భాగస్వాములు కావాలి
- విశాఖలో 'డిజీ 100 ఎక్స్ ఏపీ' సదస్సులో మంత్రి నారా లోకేష్




విశాఖపట్నం (చైతన్యరథం): 'వికసిత్ భారత్ నిర్మాణమే మన లక్ష్యం. నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది. సుసంపన్న భవిష్యత్ కోసం మానవ వనరులపై పెట్టుబడి పెట్టాలి' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తన, ఆధునిక సాంకేతికత అంశాలపై విశాఖలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో శుక్రవారం జరిగిన 'డిజీ 100 ఎక్స్ ఏపీ' (Digii100x ANDHRA PRADESH) సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'మన దేశంలో విద్య, ఆవిష్కరణల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అత్యుత్తమ మేధావుల మధ్య విశాఖపట్నంలో ఉండటం ఆనందంగా ఉంది. ఈ సభను చూస్తుంటే సంస్థలను తీర్చిదిద్దుతూ అవకాశాలను సృష్టిస్తూ ప్రతిభను పెంపొందిస్తూ కోట్లాది భారత యువత జీవితాలను ప్రభావితం చేస్తున్న నాయకులు కనిపిస్తున్నారు. మన పాత్రలు వేర్వేరుగా ఉన్నప్పటికీ మన లక్ష్యం ఒక్కటే. అదే బలమైన భారతదేశ నిర్మాణం. విద్యా రంగంలో భాగస్వామ్యం వహించడానికి ఇంతకంటే అద్భుతమైన సమయం మరొకటి లేదు.

### నైపుణ్యం కలిగిన మానవ వనరులతోనే పోటీ సామర్థ్యం పెరుగుతుంది

'ప్రపంచం అత్యంత వేగంగా మారుతోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిశ్రమలను మార్చేస్తోంది. సాంకేతికత ఉద్యోగాలను పునర్ నిర్వచిస్తోంది. అనేక రంగాలు పూర్తిగా కొత్త రూపు దాలుస్తున్నాయి. ఈ వేగవంతమైన ప్రపంచంలో ఏ రాష్ట్రానికైనా, ఏ దేశానికైనా అత్యంత పెద్ద పోటీ సామర్థ్యం భూమి, సహజ వనరులు లేదా మూలధనం కాదు.. ప్రతిభ. అందుకే ఈ చర్చ విశాఖలో జరగడం ప్రత్యేక ఆనందం కలిగిస్తోంది. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని అత్యుత్తమ ప్రతిభ అందిస్తోంది. ఏపీ దశాబ్దాలుగా ఐటీ రంగంలో ముందంజలో నిలిచింది. చంద్రబాబు తన తొలి, రెండో పదవీకాలాల్లో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా సిలికాన్ వ్యాలీ నుంచి సింగపూర్ వరకు, లండన్ నుంచి దుబాయ్ వరకు ఎక్కడ చూసినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన నిపుణులు.. బృందాలకు నాయకత్వం వహిస్తూ సంస్థలను నిర్మిస్తూ, పరిశోధనలను ముందుకు తీసుకెళ్తూ, ఆవిష్కరణలకు మార్గనిర్దేశం చేస్తూ కనిపిస్తారు. మన గొప్ప ఎగుమతి ఏదైనా ఉత్పత్తి కాదు. అది మన ప్రజలు. సుసంపన్న భవిష్యత్తును నిర్మించాలంటే వారిపై పెట్టుబడి పెట్టడం మన తొలి బాధ్యత కావాలి.' అని లోకేష్ అన్నారు.

### విద్యతోనే తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం

చాలా మంది నన్ను ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రిగా గుర్తిస్తారు. అది నా ఇండియా హ్యాట్. నేను మరో టోపీ కూడా ధరిస్తాను. దానిని నేను భారత్ హ్యాట్ అని పిలుస్తాను. అదే నా విద్యా శాఖ బాధ్యత. ముఖ్యమంత్రి శాఖల కేటాయింపుల సమయంలో నేను ఏ శాఖను కోరుకుంటానని అడిగినప్పుడు విద్యా శాఖ ఇవ్వాలని కోరాను. ఆ నిర్ణయం వెలువడినప్పుడు చాలా మంది విద్యా శాఖ వద్దని వారించారు. సంఘాలు, ఆరోపణలు, ప్రశ్నపత్రాలు, మూల్యాంకనాలు, వివాదాలు వంటి అనేక సవాళ్లు ఉంటాయని చెప్పారు. నేను మాత్రం అందుకే ఆ శాఖ అంటే ఇష్టం అని చెప్పా. ఎందుకంటే తదుపరి తరం నాయకులను ప్రేరేపించే అవకాశం విద్య ద్వారానే లభిస్తుంది. అందుకే నేను హెచ్ఆర్డీ శాఖను ఎంచుకున్నాను. పిల్లలను నేను హృదయపూర్వకంగా ప్రేమిస్తాను. వారు చూపే ప్రేమ, ఆప్యాయత, నిజాయితీ నాకు ఎంతో ఆనందాన్నిస్తాయి. అందుకే విద్యా రంగం పట్ల నాకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది.

### ఏపీలో నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం

నా దృష్టిలో విద్య అంటే కేవలం డిగ్రీ సర్టిఫికెట్ ఇవ్వడం కాదు. జీవితాంతం నేర్చుకునే ప్రక్రియలో ప్రభుత్వం, మనమందరం కలిసి భాగస్వాములు కావాలి. అందుకే మరో రెండువారాల్లో నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభించబోతున్నాం. పెద్ద ఎత్తున నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారుచేయగల రాష్ట్రాలదే భవిష్యత్. అందుకే ఏపీ వృద్ధి వ్యూహంలో నైపుణ్యాభివృద్ధి అత్యంత కీలకమైన అంశంగా ఉంది. మేం నిన్నటి ఉద్యోగాల కోసం విద్యార్థులను సిద్ధం చేయట్లేదు. ప్రస్తుతం సరికొత్తగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ వంటి రంగాల కోసం వారిని సిద్ధం చేస్తున్నాం. ఇక్కడే విద్య, ఆర్థికాభివృద్ధి ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి.

### ఏఐతో పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పన

ఈ రోజుల్లో విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను బోధించే సంస్థలు మాత్రమే కాదు. అవి ప్రతిభను తీర్చిదిద్దే కేంద్రాలు, పరిశోధనకు చోదకశక్తులు, ఆవిష్కరణలకు వేదికలు, స్టార్టప్‌ల ఆవిర్భావానికి పునాదులుగా మారాయి. ప్రపంచంలో అత్యుత్తమ విద్యా సంస్థలు టాలెంట్, నాలెడ్జ్, ఎంటర్‌ప్రెన్యూర్లను తయారు చేస్తాయి. ఈ మూడు లక్ష్యాలను సాధించగల సంస్థలతో భాగస్వామ్యం వహించడానికి ఏపీ సిద్ధంగా ఉంది. మా లక్ష్యం కేవలం పట్టభద్రులను తయారు చేయడం కాదు. ప్రపంచస్థాయి పోటీకి తగిన పరిశోధన ఆధారిత, ఆవిష్కరణలతో నడిచే సంస్థలను నిర్మించడమే మా లక్ష్యం. ఏఐ యూనివర్సిటీలను రీప్లేస్ చేయలేదు. అయితే ఏఐను స్వాగతించే యూనివర్సిటీలే భవిష్యత్తును శాసిస్తాయి. ప్రతి పారిశ్రామిక విప్లవం ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించింది. ఏఐ విషయంలో కూడా అదే జరుగుతుందని నమ్ముతున్నాను. ఏఐ ఆధారిత విద్య, పరిశోధన, పాలన, ఆవిష్కరణలకు ఏపీ ఒక ప్రయోగశాలగా మారాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో డేటా సెంటర్లు, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు అత్యంత కీలకమైనవి. ఇకపై దేశ సంపద చమురు నిల్వలతో కాదు.. కంప్యూటింగ్ సామర్థ్యంతో లెక్కిస్తారు. ఆ దిశలో భారతదేశానికి మార్గదర్శకంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలని మేము భావిస్తున్నాం. ఈ ప్రయాణంలో ఈ సభలో ఉన్న సంస్థలు కీలక పాత్ర పోషించాల్సి ఉంది.

### స్పీడ్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్... ఏపీ ప్రత్యేకతలు

పెట్టుబడిదారులకు అవసరమైన ఎకో సిస్టమ్‌ను ఏపీ నిర్మిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్... ఇవే ఏపీ ప్రత్యేకతలు. వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, సమగ్ర అభివృద్ధి వంటి లక్ష్యాల పట్ల ఉమ్మడి నిబద్ధతతో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి పని చేస్తున్నాయి. ఈ సమన్వయమే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన ప్రయోజనాన్ని అందిస్తోంది. దాని ఫలితాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి. గూగుల్ సంస్థ భారతదేశంలోనే అతిపెద్ద ప్రత్యక్ష విదేశీ పెట్టుబడి ఏపీలో పెట్టబోతోంది. ఇందుకు కేవలం 13 నెలల సమయం మాత్రమే పట్టింది. ఒక్క జూమ్ కాల్ ద్వారానే ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్ట్ సాధించగలిగాం. నిర్మాణ పనుల ప్రారంభానికి కేవలం 17 నెలలే పట్టింది. ఏపీలో ఫైటర్ జెట్ ప్రాజెక్ట్ కోసం 36 రోజుల్లోనే 600 ఎకరాలు అప్పగించాం. ఒక్కసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా ప్రాజెక్ట్.

### భారతదేశ పెట్టుబడుల్లో 25శాతం ఏపీకే

దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వస్తున్నాయి. ఇది యాదృచ్ఛికం కాదు. స్పష్టమైన లక్ష్యం, దూరదృష్టి, వేగంతో ఏపీ ముందుకు సాగుతున్నందునే ఇది సాధ్యమవుతోంది. గాజు తయారీ, డ్రోన్లు, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్, ద్విచక్ర వాహనాలు, కంప్రెస్డ్ బయోగ్యాస్ వంటి అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయి. ఇటీవల రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా తన తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. విద్య, ఆర్థికాభివృద్ధిని సమాంతరంగా నడిపిస్తున్నాం. ఇవి ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి. ఇదే ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా నిలబెడుతోంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల విజయగాథల నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని మీ అందరినీ హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నా.

### రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధి

యువతకు అవకాశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. ఫిషరీస్, ఆక్వాకల్చర్, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, గ్లాస్ మ్యానుఫ్యాక్చరింగ్, ఫార్మాస్యూటికల్స్, కెమికల్స్, ఏరోస్పేస్, ఎయిర్‌క్రాఫ్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, డేటా సెంటర్స్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. మీ నుంచి మరింత సూచనలు, సలహాలు కావాలి. ప్రభుత్వంగా మేం కేవలం మార్గదర్శకులం మాత్రమే. ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహిస్తూ భుజం భుజం కలిపి దేశానికి మరింత మెరుగైన సేవలు అందించేలా కలిసి పని చేయాలని మేం కోరుకుంటున్నాం. ఈరోజు నిర్వహించిన ఈ సమావేశం ఆ దిశలో తొలి అడుగు మాత్రమే. ఇంకా చాలా దూరం కలిసి ప్రయాణించాల్సి ఉంది. మీ అభిప్రాయాలు, సూచనలను మాతో పంచుకోండి. మాది పారదర్శకమైన ప్రభుత్వం. మీ అభిప్రాయాలను విలువైనవిగా భావిస్తాం.

'విద్యార్థులు ఓటమికి కుంగిపోవద్దు. నేను తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసినప్పుడు ఓడిపోయాను. కానీ వెనక్కి తగ్గలేదు. దానిని సవాలుగా తీసుకున్నా. కసితో పనిచేసి చివరకు ఏపీ చరిత్రలోనే మూడో అత్యధిక మెజార్టీతో విజయం సాధించా. అందుకే మేం కొత్త ఆలోచనలను, సూచనలను స్వాగతిస్తాం. మీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలి' అని మంత్రి లోకేష్ కోరారు.

సదస్సులో డిజీ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో హేమంత్ సహల్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి, కళాశాల విద్యా శాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్‌తో పాటు విద్యారంగ నాయకులు, వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు, చాన్సలర్లు, వైస్ చాన్సలర్లు, విద్యావేత్తలు, వ్యవస్థాపకులు, పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల సీఈవోలు, ఎండీలు, సీఎక్స్ వోలు పాల్గొన్నారు.








# పాలకులుగా కాదు సేవకులుగా పని చేస్తున్నాం

**రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు 'ట్వీట్'**

అమరావతి (చైతన్యరథం): ఐదు కోట్ల మంది ప్రజల అపార నమ్మకంతో ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండేళ్లు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్తే...అన్నింటినీ అధిగమిస్తూ సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలన అందిస్తున్నాం. అధికారాన్ని బాధ్యతగా, పాలకులు అంటే సేవకులుగా భావిస్తూ పనిచేస్తున్నాం. ప్రతి పౌరుడినీ, ప్రతి కుటుంబాన్నీ, ప్రతివర్గాన్ని గెలిపించడమే అజెండాగా పని చేస్తున్నాం. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రాభివృద్ధిలో అడుగడుగునా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరఫున ధన్యవాదాలు. అటు కేంద్ర ప్రభుత్వ సహకారం, ఇటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నాం.' అంటూ రెండేళ్ల ప్రయాణంలో అండగా ఉన్న రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ప్రజల మద్దతు, సహకారం కోరారు.

# ప్రజల ఆశీస్సులే కొండంత బలం

**రెండేళ్ల పాలనపై మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): 'ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలన రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యంగా సాగింది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంది.అభివృద్ధి వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలకూ ప్రగతి ఫలాలు పంచింది.సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయి.సమర్థ నాయకత్వం, సమన్వయంతో సాగుతున్న ప్రజా ప్రభుత్వం సుపరిపాలనకు ప్రజల ఆశీస్సులే కొండంత బలం.' అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

## డీఎస్సీపై తప్పుడు ప్రచారం...

# జగన్ క్షమాపణలు చెప్పాలి

**'ఎక్స్'లో మంత్రి లోకేష్**




అమరావతి (చైతన్యరథం): అమరావతి మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్ వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి నారా లోకేష్ డిమాండ్ చేశారు. అభ్యర్థుల్లో అనవసర ఆందోళన కలిగించినందుకు వారికి సారీచెప్పాలన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో ఆయన ఓ వీడియోను పోస్ట్ చేశారు. 'జగన్ చేసేవి అబద్ధపు ప్రచారాలని అందరికీ తెలిసింది.ఆయన ఆరోపణలను వాస్తవాలు, గణాం కాలతో గట్టిగా తిప్పికొట్టాం. మేం మొదట్నుంచీ చెప్పిన దాన్ని కోర్టులు కూడా సమర్థించాయి. ఈ నిజ నిర్ధారణ సత్యాన్ని నిరూపిస్తోంది" అని లోకేష్ పేర్కొన్నారు.

# యువత కలల సాకారమే మా సంకల్పం



అమరావతి (చైతన్యరథం): "రాష్ట్ర యువత కన్న కలలను నిజం చేయ డమే మా కూటమి ప్రభుత్వ నిరంతర ప్రయత్నం, బలమైన సంకల్పం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. తిరుపతిలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ విజయవంతం కావడంపై ఆయన 'ఎక్స్'(ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రభుత్వ ప్రతి ష్టాత్మక ప్రాజెక్ట్ ఆర్‌టీఐహెచ్ ద్వారా యువతకు చేకూరుతున్న సాంకేతిక, ఉపాధి లాభాలను వివరిస్తూ ఓ యువతి మాట్లాడిన వీడియోను సీఎం చంద్రబాబు షేర్ చేశారు.

# రాష్ట్ర ప్రజల వాణిని రాజ్యసభలో వినిపించండి

**నూతన ఎంపీలతో మంత్రి నారా లోకేష్**

అమరావతి (చైతన్యరథం): ఏపీ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ రాజ్యసభలో రాష్ట్ర ప్రజల వాణిని సమర్థంగా వినిపించాలని, కేంద్రం-రాష్ట్రం మధ్య వారధిగా నిలిచి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు.











# విశాఖలో మంత్రి లోకేష్‌కు ఆత్మీయ స్వాగతం

విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో ఉన్నత విద్య, డిజిటల్ పరివర్తన, ఆధునిక సాంకేతికత అంశాలపై విశాఖలో శుక్రవారం నిర్వహించిన 'డిజీ 100 ఎక్స్ ఏపీ' (Digii100x ANDHRA PRADESH) సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు మంత్రి నారా లోకేష్ విచ్చేశారు. విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు. పలువురితో ముచ్చటించి వినతులు అందుకున్నారు. డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించిన మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు చెప్తూ ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతతో పలువురు బ్యానర్లు ప్రదర్శించారు.













# తిరుపతిలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం

తిరుపతి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం దామినేడులో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ తిరుపతి చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర మంత్రులు, తిరుపతి జిల్లాకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ ప్రజలతో కరచాలనం చేసి వారి నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు.









## భూములు ఇచ్చేందుకు
# మోతడక రైతులు ఓకే

- అపోహలను నివృత్తిచేసిన మంత్రి నారాయణ
- రైతులకు అందించే ప్రతిఫలంపై స్పష్టత

అమరావతి (చైతన్య రథం): తాడికొండ మండలం మోతడకలో మంత్రి నారాయణ రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. పెదపరిమిలో ప్రస్తుతం పూలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అదే మండలంలోని మోతడక రైతులతో ల్యాండ్ పూలింగ్ అంశంపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ల్యాండ్ పూలింగ్‌పై రైతుల్లో నెలకొన్న అపోహలను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ నివృత్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న హామీలు, రైతులకు అందే ప్రతిఫలంపై స్పష్టతనిచ్చారు. దీంతో భూములు అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని రైతులు ప్రకటించారు. 125 ఎకరాల భూమిలో 75 ఎకరాలను మంత్రి చేతుల మీదుగా సీఆర్డీఏకు అధికారికంగా అప్పగించారు. మిగతా భూములను సైతం త్వరితగతిన అందజేయాలని మంత్రి రైతులను



కోరారు. మోతడకలో రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు సీఆర్డీఏ నుండి రూ. 1.26 కోట్లు తక్షణమే విడుదల చేయాలని మంత్రి నారాయణ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చైతన్యరథం

# ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం

- అధికార గర్వానికి ప్రజలు నేర్పిన గుణపాఠమే 2024 తీర్పు
- ప్రజలు మనకిచ్చింది అధికారం కాదు.. రాష్ట్ర పరిరక్షణ బాధ్యత
- గాంధీ, అంబేద్కర్ ఆశయాల సమాహారమే ప్రధాని మోదీ పాలన
- నవ భారత నిర్మాణంలో పంచాయతీల పాత్రే కీలకం
- స్థానిక సంస్థలను బలహీనపర్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేం
- కుల, ప్రాంతీయ పరిమితులుదాటి భారతీయత వైపు అడుగులేద్దాం
- వ్యవస్థలపై నమ్మకం తగ్గితే సమాజం ముక్కలవుతుంది
- రెండేళ్లలో మేము నిర్మించింది రోడ్లు, భవనాలు కాదు.. వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం
- అథారిటీ, రెస్పాన్సిబిలిటీ, అకౌంటబిలిటీ విడిపోతే వ్యవస్థలు కుప్పకూలతాయి
- సమస్య నిధుల కొరత మాత్రమే కాదు.. బాధ్యతలపై స్పష్టత లేకపోవడమే
- పంచాయతీరాజ్ వ్యవస్థ నాయకులను తయారు చేసే ప్రజాస్వామ్య పాఠశాల
- డిజిటలైజేషన్‌తో పల్లెల ముఖచిత్రాలు మారుతున్నాయి
- వచ్చే ఎన్నికల కోసం కాదు.. వచ్చే తరాల కోసం నిర్ణయాలు తీసుకుందాం
- రాబోయే తరాలు గర్వించే సమాజ నిర్మాణమే కూటమి సమష్టి బాధ్యత
- తిరుపతి బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉద్ఘాటన



తిరుపతి (చైతన్య రథం): 'సరిగ్గా రెండేళ్ల క్రితం 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక చారిత్రక తీర్పు ఇచ్చారు. ఆ తీర్పు కేవలం ఒక గెలుపు కాదు... అహంకారంపై సామాన్యుడు సంధించిన బలమైన సందేశం. భయాన్ని, అహంకారాన్ని, అధికారమే అంతా అనే అనాగరిక రాజకీయ సంస్కృతిని ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల కంటే ఎవరూ ఎక్కువ కాదని నిరూపించారు. ప్రజలు మనకిచ్చింది కేవలం అధికారం కాదు, రాష్ట్రాన్ని కాపాడి ప్రగతిపథంలో నడిపించే గొప్ప బాధ్యత' అని జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ చారిత్రక విజయానికి కారణమైన ప్రతి ఓటరుకీ, రైతుకు, నాయకుడికి, కార్యకర్తకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కూటమిలోని ఏ ఒక్క పార్టీదో కాదు, ఇది ప్రజా విజయమన్నారు. దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే జనసేన పార్టీ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి బలమైన పునాది పడినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం 21 సీట్లకు పరిమితమైన జనసేన త్యాగానికి ప్రజలు 100 శాతం స్ట్రయిక్ రేట్‌తో సమాధానమిచ్చారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి వేదికగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సభను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వర్తించి నెహ్రూ రికార్డును అధిగమించిన ప్రధాని నరేంద్ర మోదీకి కూటమి ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. జనసేన 21 సీట్లకు సరిపెట్టుకున్నప్పుడు చాలామంది విమర్శలు చేశారు. మేము రాజీపడలేదు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం 21 సీట్లకు పరిమితమయ్యాం. ఆ త్యాగం ఫలితంగా ఈరోజు మేమిచ్చిన హామీలు ఒక్కొక్కటిగా ఆచరణలో కనబడుతున్నాయి. పెరిగిన వృద్ధాప్య పింఛన్లు, మహిళలకు ఆర్థిక భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అండగా అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు, విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత, యువతకు ఉపాధి అవకాశాలు –ప్రతి అంశంలో మేము ఇచ్చిన మాట తూచా తప్పకుండా ఆచరణలో పెడుతున్నాం.

### ప్రజల జీవితాలకు దగ్గరగా ఉండేది గ్రామ పరిపాలనా వ్యవస్థే

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, దీనదయాళ్ ఉపధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం, బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా స్థానిక స్వపరిపాలనకు వేసిన ప్రజాస్వామ్య పునాదుల ఆలోచనల సమాహారమే నేటి ప్రధాని మోదీ పాలనా తత్వం. "సబ్ కా సాత్.. సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్". పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా గ్రామాన్ని భారతదేశానికి కేంద్ర బిందువుగా చూడాలన్న ఆకాంక్షతో మాట్లాడుతున్నాను. పిల్లవాడి భవిష్యత్తు పాఠశాలలో నిర్ణయించబడినట్టే, దేశ భవిష్యత్తు గ్రామాల్లో నిర్ణయించబడుతుంది. ఒక రైతు ఆశ, ఒక మహిళ ఆత్మవిశ్వాసం, ఒక యువకుడి ఉపాధి, కుటుంబం ఆరోగ్యం.. ఇవన్నీ గ్రామ పంచాయతీల ద్వారానే ప్రభావితమవుతాయి. ఏ పనిని ప్రజలకు దగ్గరగా సమర్థంగా చేయగలమో ఆ పనిని అక్కడే చేయాలి. గ్రామ స్థాయిలో అవ్వాల్సిన పని మండల స్థాయికి వెళ్లకూడదు.

### అధికారాన్ని కేంద్రీకరించడం ప్రజాస్వామ్యం కాదు

అధికారాన్ని ప్రజల దగ్గరకు తీసుకువెళ్లడమే నిజమైన ప్రజాస్వామ్యం. ఒక ఎమ్మెల్యే నియోజకవర్గంలో 600 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉంటారు. ప్రజాస్వామ్యానికి వారే వేళ్లు. ఆ వేళ్లను బలహీనపరిస్తే చెట్టు నిలబడదు. స్థానిక సంస్థలను బలహీనపర్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేం. రెండేళ్లలో గ్రామాల్లో నిర్మించడానికి ప్రయత్నించింది కేవలం రోడ్లు, కాలువలు, భవనాలు కాదు.. వ్యవస్థలపై నమ్మకం. వ్యవస్థ బలహీనపడినప్పుడు మొదట కోల్పోయేది డబ్బు కాదు, నమ్మకం. వ్యవస్థ న్యాయం చేయకపోతే కులం ముందుకు వస్తుంది. వ్యవస్థపై విశ్వాసం తగ్గితే సమాజం చిన్న చిన్న గుంపులుగా విడిపోతుంది.

### మనమంతా భారతీయత వైపు అడుగులు వేయాలి

తెలుగు రాష్ట్రాలు మరింత బలపడాలంటే కులాల పరిమితులు, ప్రాంతీయత దాటి మనమంతా భారతీయత వైపు అడుగులు వేయాలి. అందుకే పంచాయతీరాజ్ శాఖ గురించి మాట్లాడేటప్పుడు కేవలం పథకాలకు పరిమితం కావడం లేదు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సామాజిక సమతుల్యత, జాతీయ సమైక్యత, సామాజిక పరస్పర విశ్వాసం తదితర అంశాలపై మాట్లాడుతున్నాను. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ పెదపెంకి గ్రామంలో ఫైలేరియా సమస్య పరిష్కారం. గతంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో సంస్కరణల కోసం బల్వంత్ మెహతా, అశోక్ మెహతా, జీవీకే రావు, ఎల్.ఎన్. సింగ్ తదితరులు ఎన్నో సూచనలు చేశారు. ఇవి 1992-93 రాజ్యాంగ సవరణగా రూపుదిద్దుకున్నాయి. 1993 నుంచి పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా లభించింది. ఆర్టికల్ 243 నుంచి 243(ఓ) వరకు పంచాయతీరాజ్ శాఖకు రక్షణ కల్పించింది. 11వ షెడ్యూల్ ద్వారా 22 అంశాలు రాజ్యాంగంలో చేర్చబడ్డాయి. దేశవ్యాప్తంగా 2.6 లక్షల గ్రామ పంచాయతీలు, 30 లక్షల మంది స్థానిక ప్రజాప్రతినిధులు, 14 లక్షలకు పైగా మహిళా ప్రజాప్రతినిధులతో ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గ్రాస్‌రూట్ ప్రయోగం.

అయితే ఈ వ్యవస్థ నిజంగా గ్రామానికి అధికారాన్ని ఇచ్చిందా? నిధులు, నిర్ణయాధికారం, బాధ్యత గ్రామానికి చేరాయా? పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రివ్యూల్లో తేలింది ఒకటే --- గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పంచాయతీల్లో కనీసం బ్లీచింగ్‌కి, జెండా పండుగ చేయడానికి డబ్బులు లేవు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. అనేక పంచాయతీలు అప్పుల బారినపడ్డాయి. వేల కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. గ్రామ స్థాయి పాలన బలహీనపడింది.

### గ్రామ సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం వెతకాలి

రాజ్యాంగం పంచాయతీలకు హోదా ఇచ్చినా దానికి జీవం పోయాల్సింది మనమే. సమస్య కేవలం నిధుల కొరత మాత్రమే కాదు.. బాధ్యతలపై స్పష్టత లేకపోవడమే అసలు కారణం. అథారిటీ ఒకచోట, బాధ్యత ఇంకోచోట, అకౌంటబిలిటీ మరోచోట. ఈ మూడు విడిపోతే వ్యవస్థ బలహీనపడుతుంది. దీన్నే బ్రోకెన్ గవర్నెన్స్ చైన్ అంటారు. గ్రామ సమస్యలకు పరిష్కారం గ్రామాల్లోనే వెతకాలి. అందుకోసం గ్రామ సభలను అధికారిక సమావేశంగా కాకుండా గ్రామ ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువుగా మార్చాం. ఎక్కడ రోడ్లు వేయాలి, ఎక్కడ నీరు అవసరం, ఎవరికి ఇల్లు అవసరం, ఎక్కడ పారిశుద్ధ్య సమస్య ఉంది. ఈ నిర్ణయాలు కార్యాలయాల్లో కాదు, గ్రామ సభలో తీసుకోవాలి. ప్రభుత్వానికి కనిపించని సమస్య ప్రజలకు కనిపిస్తుంది. గ్రామసభ బలపడితే సర్పంచ్ బలపడతాడు. సర్పంచ్ బలపడితే పంచాయతీ బలపడుతుంది. పంచాయతీ బలపడితే ప్రజాస్వామ్యం బలపడుతుంది. అప్పుడే ప్రతి చిన్న సమస్య స్థానిక ఎమ్మెల్యే టేబుల్ మీదకి రావాల్సిన అవసరం ఉండదు. ఎమ్మెల్యేలు ఉపాధి విధానాలపై, పరిశ్రమల రాకపై, యువత భవిష్యత్తుపై దృష్టి పెట్టి రాష్ట్ర భవిష్యత్తు నిర్మిస్తారు.

పంచాయతీలనుంచే బలమైన నాయకత్వం పుడుతుంది

ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఒక రోజులో పుట్టదు. అది గ్రామ సభల్లో, పంచాయతీల్లోనే రూపుదిద్దుకుంటుంది. పంచాయతీరాజ్ వ్యవస్థ కేవలం స్థానిక పరిపాలనా వ్యవస్థ కాదు --- అది నాయకత్వాన్ని తయారు చేసే ప్రజాస్వామ్య పాఠశాల. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రయాణాన్ని ఒక మున్సిపల్ కౌన్సిలర్‌గా స్థానిక సంస్థల నుంచే మొదలుపెట్టారు. నాయకత్వం అంటే కేవలం రాజకీయ నాయకత్వం కాదు. గొప్ప ఉపాధ్యాయుడు, నిజాయితీగల అధికారి కూడా నాయకులే. 50 శాతం మహిళా రిజర్వేషన్ ద్వారా వేలాది మంది మహిళా నాయకులు స్థానిక సంస్థల ద్వారా ముందుకు వస్తున్నారు. వెనుకబడిన తరగతులు, యువత నుంచి నాయకత్వం వస్తుంది. యువత మొదటి అడుగు గ్రామ స్థాయిలోనే వేయాలి.

### గ్రామ సభతో ప్రతి గడపకు ప్రజాస్వామ్యం

అభివృద్ధికి మొదటి అర్హత స్థిరత్వం. రాష్ట్రంలో గత రెండేళ్లుగా ఏర్పడిన రాజకీయ స్థిరత్వం గ్రామాభివృద్ధికి బలమైన పునాది వేసింది. ఆ స్థిరత్వం ఆధారంగా 13,326 పంచాయతీల్లో ఒకే సారి గ్రామ సభలు నిర్వహించాం. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించాం. పల్లెపండుగను ప్రజా ఉద్యమంగా మార్చాం. స్థానిక నాయకత్వానికి పోయిన గౌరవాన్ని తిరిగి నిలబెట్టాం.

స్వర్ణ పంచాయతీ దిశగా ప్రయాణం ప్రారంభించాం. తిరుపతి జిల్లా పరిధిలోని శ్రీనివాసపురం పంచాయతీలో స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆస్తుల వివరాలు శాస్త్రీయంగా నమోదు చేశాం. పంచాయతీ రికార్డుల్లో కనిపించని ఆస్తులు మొదటిసారి వ్యవస్థల్లో కనిపించాయి. ఆస్తుల సంఖ్య 1,291 నుంచి 1,356కు పెరిగింది. ఫలితంగా పంచాయతీ ఆదాయ సామర్థ్యం రూ. 75 లక్షల నుంచి రూ. 1.66 కోట్లకు పెరిగింది --- ఒక్క రూపాయి పన్ను పెంచకుండా. వ్యవస్థలు సరిగా పని చేస్తే గ్రామాలు సృష్టించగల సామర్థ్యానికి ఇది ఒక బలమైన ఉదాహరణ.

2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం పార్లమెంటు భవనం నుంచి కాదు --- 2.6 లక్షల గ్రామ పంచాయతీల నుంచి ప్రారంభమవుతుంది. ఒక చిన్న వాగు తన పరిసరాల్లోని భూములకు నీరందించి తదుపరి నదుల్లో కలిసినట్టు, ప్రతి పంచాయతీ తన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటే మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం బలపడుతుంది.

రెండేళ్ల క్రితం ప్రజలు మాకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇచ్చారు. అది కేవలం అధికార బదిలీ కాదు, నమ్మకం బదిలీ. నమ్మకాన్ని నిలుపుకోవడమే మన బాధ్యత. ప్రజలు పార్టీని కాకుండా వ్యవస్థలను నమ్మాలి. నాయకులను కాకుండా సంస్థలను, వ్యక్తులను కాకుండా విలువలను నమ్మాలి --- అప్పుడే ప్రజాస్వామ్యం శాశ్వతమవుతుంది. గ్రామం బలపడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రజాస్వామ్యం బలపడితే దేశం బలపడుతుంది.

మన నిర్ణయాలు వచ్చే ఎన్నికల గురించి కాకుండా భవిష్యత్ తరాల కోసం ఉండాలి. రాబోయే తరాలు గర్వించే సమాజాన్ని నిర్మించడం కూటమి బాధ్యత. ఆ బాధ్యతను నిర్వర్తించే సంకల్పంతో గ్రామం నుంచి దేశం వరకు బాధ్యతతో కూడిన అభివృద్ధి యాత్రను ముందుకు తీసుకువెళ్తామని తెలియజేసుకుంటున్నాను" అన్నారు.

చంద్రగిరి శాసనసభ్యుడు పులివర్తి వెంకట మణిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర విద్య, ఐటి, కమ్యూనికేషన్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమమే కూటమి లక్ష్యం

- సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక భద్రతకు ప్రాధాన్యత
- గత రెండేళ్లలో కార్మిక రంగంలో సమగ్ర సంస్కరణలు
- డిజిటల్ సేవల విస్తరణ - నైపుణ్యాభివృద్ధికి భారీ ప్రోత్సాహం
- రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి




అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా, అభివృద్ధి లక్ష్యంగా భావించి పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి పునాదులు కార్మికుల శ్రమతోనే నిర్మితమవుతాయని, అందువల్ల కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. శు క్రవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత రెండేళ్లలో కార్మిక శాఖలో చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, డిజిటల్ సేవలు, నిర్మాణ కార్మిక సంక్షేమ చర్యలు, ఇఎస్ఐ వైద్య సేవల విస్తరణ, పారిశ్రామిక భద్రతా కార్యక్రమాల పురోగతిని వివరించారు.

### గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్న కార్మిక సంక్షేమ వ్యవస్థకు పునర్జీవం...

గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో కార్మిక సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని మంత్రి విమర్శించారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులు ఉన్నప్పటికీ వాటిని కార్మికుల కోసం వినియోగించకుండా వదిలేశారని, సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, నిర్మాణ కార్మిక బోర్డులు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక సంక్షేమ వ్యవస్థను పునరుద్ధరిం చేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణ కార్మికుల కోసం నిలిచిపోయిన సంక్షేమ పథకాలను మళ్లీ ప్రారంభించడమే కాకుండా వాటిని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల పునరుద్ధరణ...

గతంలో నిలిచిపోయిన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం 01 మార్చి 2026 నుండి పునరుద్ధరించిందన్నారు. వివాహ బహుమతి రూ.20,000, ప్రసూతి ప్రయోజనం రూ.20,000, సహజ మరణ సహాయం రూ.60,000, అంత్యక్రియల ఖర్చులు రూ.20,000 చొప్పున అందజేస్తోందన్నారు. ఈ మొత్తాలను మరింత పెంచే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. అన్ని ప్రయోజనాలను ఆధార్ ఆధారిత డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయడం ద్వారా పారదర్శకతను తీసుకురావడం జరిగిందన్నారు.

### 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల లక్ష్యం...

అసంఘటిత రంగ కార్మికులకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఉపాధి సమాచారం, త్రాగునీరు, వై-ఫై, పారిశుధ్య సౌకర్యాలు, కార్మికుల నమోదు, సంక్షేమ అవగాహన, నైపుణ్యాభివృద్ధి సేవలు ఒకే చోట అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నమూనాను విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

### డిజిటల్ గవర్నెన్స్‌లో విప్లవాత్మక మార్పులు...

కొత్త లేబర్ కోడ్స్‌కు అనుగుణంగా ట్రేడ్ యూనియన్ నమోదు, కార్మికుల నమోదు, గ్రీవెన్స్ పరిష్కారం, సంక్షేమ క్లెయిమ్స్, బాల కార్మికుల పర్యవేక్షణ, అర్ధ న్యాయ విధులు తదితర సేవల కోసం పూర్తి స్థాయి ఆన్‌లైన్ మాడ్యూల్స్ అభివృద్ధి చేయబడ్డాయి. 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కార్మికులు ఇంటి వద్ద నుంచే సేవలను పొందే అవకాశం కల్పించబడింది. కార్మిక శాఖ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకత, వేగవంతమైన సేవల పంపిణీ, రియల్ టైమ్ పర్యవేక్షణ సాధ్యమైంది.

### 88.67 లక్షల అసంఘటిత కార్మికుల నమోదు...

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఇ-శ్రమ్ పోర్టల్‌లో 88.67 లక్షల మంది నమోదు అయ్యారన్నారు. 2024-25లో 4,33,191, 2025-26లో 3,59,628 కొత్త నమోదులు జరిగినట్లు తెలిపారు. అదే విధంగా, ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో 18.26 లక్షల మంది కార్మికులు నమోదు అయ్యారన్నారు. రాష్ట్రంలో కార్మికుల సమగ్ర డేటాబేస్ సృష్టించి, భవిష్యత్తులో అమలు చేయబోయే సామాజిక భద్రతా పథకాలకు పునాది వేయబడిందని మంత్రి తెలిపారు.

### 1,408.58 కోట్ల సెస్ వసూళ్లు...

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 2024-25లో రూ.675.39 కోట్లు, 2025-26లో రూ.733.19 కోట్లు, మొత్తంగా రూ.1,408.58 కోట్లు సెస్ వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతా కార్యక్రమాలకు వినియోగించేందుకు కార్యాచరణ రూపొందించబడిందని తెలిపారు.

### కార్మిక బోర్డుల పునరుజ్జీవనం...

ఏపీ రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించి ఒక చైర్మన్, 22 మంది సభ్యులతో బలోపేతం చేశామన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాల పునరుద్ధరణ, లేబర్ అడ్డాల ఏర్పాటు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల పునఃప్రారంభం, సేవల డిజిటలైజేషన్ చేపట్టబడిందన్నారు. సంఘటిత రంగ కార్మికుల కోసం 10 సంక్షేమ పథకాల పునరుద్ధరణకు చర్యలు ప్రారంభమయ్యాయని మంత్రి తెలిపారు.

### 85,000 మందికి నైపుణ్యాభివృద్ధి లక్ష్యం...

2019-24 మధ్య నిలిచిపోయిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పునరుద్ధరించి, 85,000 మంది లబ్ధిదారులకు శిక్షణ అందించే లక్ష్యంతో కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయన్నారు. ఇందులో 25,000 మంది కార్మికులకు సీఐఐఏపీ ద్వారా, 60,000 మంది కుటుంబ సభ్యులకు ఏపీటీస్ ద్వారా, మొత్తం 41 ఉద్యోగ అవకాశాలు కలిగే ట్రేడ్లలో శిక్షణలు అందించబడుతున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ, సర్టిఫికేషన్, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యం అని మంత్రి తెలిపారు.

### లేబర్ కోడ్స్ అమలుకు సిద్ధత...

29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు సమగ్ర లేబర్ కోడ్స్‌గా ఏకీకృతం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా నిబంధనలను రూపొందించి వాటాదారుల అభిప్రాయాలను సేకరించిందన్నారు. కార్మికులకు మెరుగైన సామాజిక భద్రత, సకాలంలో వేతనాలు, సురక్షిత పని స్థలాలు; యజమానులకు సరళీకృత అనుమతులు; ప్రభుత్వానికి డిజిటల్ గవర్నెన్స్ వంటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతున్నదన్నారు.

### ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కీలక సంస్కరణలు...

మహిళలకు భద్రతా ప్రమాణాలతో నైట్ షిఫ్టులలో పని చేసే అవకాశం, రోజువారీ పని గంటలను 8 నుండి 10 గంటలకు పెంచడం, దుకాణాలు మరియు సంస్థలకు జీవితకాల నమోదు, పెద్ద పట్టణాల్లో ట్వెంటీఫోర్ ఇంటూ సెవెన్ కార్యకలాపాలకు అనుమతివంటి సంస్కరణలు అమలు చేయబడ్డాయన్నారు. వీటి ద్వారా పెట్టుబడులు, ఉపాధి, పరిశ్రమల వృద్ధికి అనుకూల వాతావరణం కల్పించబడుతోందని మంత్రి తెలిపారు.

### కేర సురక్ష బీమా పథకం...

కొబ్బరి కార్మికుల కోసం ప్రారంభించిన కేర సురక్ష బీమా పథకం ద్వారా తొలి దశలో 2,500 మంది కార్మికులకు బీమా రక్షణ కల్పించబడిందన్నారు. మరణం లేదా శాశ్వత వైకల్యానికి రూ.7 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.3.5 లక్షలు, ఆసుపత్రి ఖర్చులకు రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే విధంగా ఈ పథకం రూపొందించబడిందన్నారు.

### శ్రమశక్తి అవార్డుల పునరుద్ధరణ...

2018 తరువాత నిలిచిపోయిన శ్రమశక్తి అవార్డులను ప్రభుత్వం పునరుద్ధరించి 46 శ్రమశక్తి అవార్డులు, 28 ఉత్తమ యాజమాన్య అవార్డులు ప్రదానం చేయడం జరిగిందన్నారు. కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, యాజమాన్యాల విశిష్ట సేవలను గుర్తించి ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

### 7.85 లక్షల కార్మికులకు ఆరోగ్య పరీక్షల లక్ష్యం...

భవన నిర్మాణ కార్మికుల కోసం 7.85 లక్షల మంది కార్మికులను కవర్ చేసే ప్రివెంటివ్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. వృత్తి సంబంధిత వ్యాధులను ముందుగానే గుర్తించడం, ఆరోగ్య డేటా సేకరణ, నివారణ ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం అన్నారు.

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో విశేష ఫలితాలు...

బాల కార్మికులు, వెట్టిచాకిరి నిర్మూలనలో కార్మిక శాఖ నోడల్ శాఖగా పనిచేస్తూ ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించిందన్నారు. ఈ క్రమంలో 1,399 మంది బాల కార్మికులను రక్షించడం, 963 కనీస వేతనాల క్లెయిమ్స్ దాఖలు చేయడం, రూ.24.32 లక్షల పరిహారం సాధించడం, 19 మంది పిల్లల కోసం రూ.3.80 లక్షల రికవరీ చేయడం వంటి ముఖ్యమైన విజయాలు సాధించడం జరిగిందని మంత్రి తెలిపారు.

### ఇఎస్ఐ సేవల విస్తరణ - కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు...

గత రెండు సంవత్సరాలలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ కార్మికుల ఆరోగ్య భద్రత, వైద్య సేవల విస్తరణ, మౌలిక సదుపాయాల బలోపేతం మరియు డిజిటల్ గవర్నెన్స్ రంగాలలో విశేష పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 15.32 లక్షల మంది ఇఎస్ఐ భీమా వ్యక్తులు మరియు దాదాపు 60 లక్షల మంది లబ్ధిదారులకు సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. గత రెండేళ్లలో 8,036 శస్త్రచికిత్సలు, 178 ప్రసవాలు విజయవంతంగా నిర్వహించబడగా, గతంలో నిలిచిపోయిన వైద్య సేవలను పునరుద్ధరించి మరింత విస్తరించడం జరిగిందని మంత్రి తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా కొత్త వైద్య మౌలిక సదుపాయాల కల్పన కోసం 14 భూమి బదలాయింపులు మరియు కేటాయింపులు పూర్తి చేయడంతో పాటు, తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసి 191 అదనపు పోస్టులను మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఆరోగ్య సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు 92 మంది వైద్య, పారామెడికల్ మరియు పరిపాలనా సిబ్బందికి పదోన్నతులు కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీలు, 57 ప్రస్తుత డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్, అలాగే విశాఖపట్నం మరియు అమరావతిలో రెండు ఈఎస్ఐ మెడికల్ కాలేజీల స్థాపనకు చర్యలు చేపట్టబడ్డాయన్నారు. అత్యవసర వైద్య సేవల బలోపేతం కోసం సీఎస్ఆర్ భాగస్వామ్యంతో 3 అంబులెన్సులను సమీకరించడం జరిగిందన్నారు.

అదే విధంగా, గ్రీవెన్స్ రీడ్రెస్సల్ వ్యవస్థ, మొబైల్ హెల్త్ అప్లికేషన్లు, ధన్వంతరి - ఇ-ఔషధి సమన్వయం వంటి కార్యక్రమాల ద్వారా డిజిటల్ హెల్త్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టి, పారదర్శకమైన మరియు ప్రజాకేంద్రిత వైద్య సేవల అందుబాటును మరింత మెరుగుపర్చడం జరిగిందని మంత్రి తెలిపారు.

### పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత...

రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను అత్యున్నత ప్రాధాన్య అంశంగా గుర్తించిన ప్రభుత్వం "జీరో యాక్సిడెంట్స్" లక్ష్యంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలను ముందస్తుగా నివారించడం, కార్మికుల ప్రాణభద్రతను కాపాడడం మరియు సురక్షితమైన పనివాతావరణాన్ని నెలకొల్పడం కోసం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ దిశగా సేఫ్టీ ఆడిట్లు, అత్యవసర సన్నద్ధత కోసం మాక్ డ్రిల్స్, భద్రతా అధికారుల శిక్షణ కార్యక్రమాలు, విశ్వవిద్యాలయాలు మరియు నిపుణ సంస్థలతో అవగాహన ఒప్పందాలు, అలాగే జిల్లా సంక్షోభ నిర్వహణ బృందాల ఏర్పాటు వంటి కీలక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అదనంగా, సేఫ్టీ అలర్టులు, ఇన్సిడెంట్ అలర్టులు, డిజిటల్ పర్యవేక్షణ వ్యవస్థల ద్వారా భద్రతా ప్రమాణాల అమలును మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు.

ఈ సమగ్ర చర్యల ఫలితంగా పరిశ్రమల్లో భద్రతా సంస్కృతి మరింత బలపడటమే కాకుండా, పారిశ్రామిక ప్రమాదాలు మరియు ప్రమాదాల కారణంగా సంభవించే మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల భద్రత, పరిశ్రమల స్థిరాభివృద్ధి మరియు పెట్టుబడిదారుల విశ్వాసం అనే మూడు లక్ష్యాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు, ఫ్యాక్టరీల డైరెక్టర్ మోహనరావు, ఐఎంఎస్ డైరెక్టర్ ఆంజనేయులు, రాష్ట్ర బాయిలర్స్ విభాగం అధికారి ఉమామహేశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

చైతన్యరథం

# విమల విద్యాలయం పునరుజ్జీవంతో సాకారమైన ఉక్కునగర ప్రజల కల

- మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధి, పట్టుదలతో విద్యార్థులు, ఉపాధ్యాయ కుటుంబాల్లో కొత్త ఆశలు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



విశాఖపట్నం (చైతన్య రథం): ఉక్కునగర ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ విశాఖ విమల విద్యాలయం పునరుద్ధరణతో వేలాది విద్యార్థులు, ఉపాధ్యాయ కుటుంబాల్లో మళ్లీ ఆశలు చిగురించాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఒకప్పుడు స్టీల్ ప్లాంట్ ఎయిడెడ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలిచిన విమల విద్యాలయం మనుగడే ప్రశ్నార్థకంగా మారిన క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం సంతోషకరమన్నారు.

విమల విద్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాలగా కొనసాగించే నిర్ణయం అనంతరం జిల్లా కలెక్టర్ అభిషేక్ కిషోర్, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్, డిప్యూటీ డీఈఓ సోమేశ్వరరావుతో కలిసి పాఠశాలను సందర్శించిన సందర్భంగా పల్లా శ్రీనివాసరావు విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, విద్యా బోధనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. విమల విద్యాలయం సమస్య పరిష్కారం కోసం గత ఏడాదిగా నిరంతరంగా కృషి చేశానని పల్లా తెలిపారు. ఢిల్లీలో పలుమార్లు కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డి కుమారస్వామిని కలిసి వినతిపత్రాలు సమర్పించడంతోపాటు, ఆయన విశాఖ పర్యటనలకు వచ్చిన ప్రతిసారీ సమస్య తీవ్రతను వివరించి పాఠశాల భవిష్యత్తును కాపాడాలని కోరానన్నారు. అలాగే ఎంపీ శ్రీభరత్ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి పరిష్కారం కోసం అవిశ్రాంతంగా ప్రయత్నించానని చెప్పారు. ఏడాది కాలంలో 30కి పైగా వినతిపత్రాలు సమర్పిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల భవిష్యత్తు కోసం పట్టువదలకుండా కృషి చేశానన్నారు. సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే వారు సానుకూలంగా స్పందించారని పల్లా తెలిపారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని విద్యార్థుల చదువులకు అంతరాయం కలగకూడదనే సంకల్పంతో ప్రత్యేక చొరవ చూపారన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ విమల విద్యాలయం పునరుద్ధరణకు మార్గం సుగమం చేశారని కొనియాడారు. విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్న మంత్రి నారా లోకేష్... విమల విద్యాలయం విషయంలో చూపిన చిత్తశుద్ధి, నిబద్ధత, దూరదృష్టి, పట్టుదల అభినందనీయమని పల్లా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల జీవనోపాధి, ఉక్కునగర ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయం వల్ల నేడు ఈ విద్యాసంస్థకు పునర్జీవం లభించిందన్నారు. సమస్యను కేవలం పరిపాలనా అంశంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి పరిష్కారం చూపడం లోకేష్ నాయకత్వానికి నిదర్శనమన్నారు. గతంలో స్టీల్ ప్లాంట్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాల భవిష్యత్తు అనిశ్చితిలో పడిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ముందుకు వచ్చి విమల విద్యాలయాన్ని పరిరక్షించడం ద్వారా వేలాది కుటుంబాలకు భరోసా కల్పించిందన్నారు. ఈ నిర్ణయంతో 32 మంది బోధనా, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత లభించడంతోపాటు, ఉక్కునగరంలోని వందలాది విద్యార్థుల విద్యాభవిష్యత్తు సురక్షితమైందన్నారు.

విమల విద్యాలయం పునరుద్ధరణ కేవలం ఒక పాఠశాల కొనసాగింపుకు సంబంధించిన అంశం కాదని... ఉక్కునగర ప్రజల ఆకాంక్షలు, విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయ కుటుంబాల జీవనోపాధిని పరిరక్షించిన చారిత్రాత్మక నిర్ణయమని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు పొందడం ఈ విద్యాసంస్థపై ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో విమల విద్యాలయం మరింత అభివృద్ధిచెంది గాజువాక ప్రాంతంలో నాణ్యమైన విద్యకు మరోసారి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విమల విద్యాలయం పునరుద్ధరణకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ఎంపీ శ్రీభరత్, జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉక్కు పరిశ్రమ యాజమాన్యానికి పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరాన్‌లో చిక్కుకున్న విజయనగరం జిల్లా నావికులు

**- సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు ఎంపీ కలిశెట్టి అత్యవసర లేఖ**



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు సీఫేరర్స్ (నావికులు) ఇరాన్‌లోని 'బందర్ అబ్బాస్' పోర్టు సమీపంలో చిక్కుకున్న ఘటనపై విజయనగరం లోక్‌సభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అత్యంత వేగంగా స్పందించారు. బాధితులను క్షేమంగా స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ప్రత్యేక కమిషనర్ అర్జ శ్రీకాంత్‌కు ఎంపీ గురువారం అత్యవసర లేఖలు రాశారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలానికి చెందిన ఐదుగురు యువకులు సోమరాజు కొమర, దుర్గాప్రసాద్ నగలా, విష్ణు జీరి, రవివంకల, రమణ పరపాతి గత జూలై 2025లో ఇరాన్‌లో 'పాస్కల' అనే నౌకలో ట్రైనీ వైపర్లుగా ఉద్యోగంలో చేరారు. అయితే, మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో నెలకొన్న తాజా యుద్ధ/ సంఘర్షణ వాతావరణం కారణంగా సదరు నౌక గత మార్చి 2026 నుండి బందర్ అబ్బాస్ పోర్టు సమీపంలో నిలిచిపోయింది. గత మూడు నెలలుగా సముద్రంలోనే చిక్కుకుపోవడంతో ఆ యువకులకు కనీస మంచినీరు, ఆహార సదుపాయాలు అందడం లేదని, వారు తీవ్రమైన మానసిక, శారీరక క్షోభను అనుభవిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ మరియు బాధిత కుటుంబాలు ఈ విషయాన్ని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టికి తీసుకువచ్చారు.

ఈ అంశంపై ఎంపీ మాట్లాడుతూ.. "మన జిల్లా యువకులు పరాయి దేశంలో ప్రాణభయంతో, కనీస సదుపాయాలు లేక అల్లాడిపోతుండటం నన్ను తీవ్రంగా కలచివేసింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ద్వారా ఇరాన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, మన ఐదుగురు తెలుగు యువకులను తక్షణమే సురక్షితంగా దేశానికి రప్పించేలా చొరవ చూపాలని కేంద్ర విదేశాంగ మంత్రిని కోరాను. అలాగే ఢిల్లీలోని ఏపీ భవన్ ద్వారా కూడా దీనిపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించాను. బాధితుల కుటుంబాలు అధైర్యపడొద్దు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వారిని త్వరలోనే సురక్షితంగా జిల్లాకు తీసుకువస్తాం" అని భరోసా ఇచ్చారు.

## ప్రజాపాలనకు రెండేళ్లు



### రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు: మంత్రి కొలుసు

అమరావతి (చైతన్య రథం): 94 శాతం స్ట్రైక్ రేట్‌తో, 164 సీట్ల పెను ప్రభంజనంతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు శ్రీకారం చుట్టి నేటికి రెండేళ్లు పూర్తైన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి కొలుసు పార్థసారథి శుభాకాంక్షలు తెలిపారు. గొడ్డలిపార్టీని, కాలకేయ దొంగలముఠాని 164 అడుగుల గొయ్యి తీసి ప్రజలే కప్పిపెట్టి తెలుగు ప్రజల సత్తా ఏంటో దేశ రాజకీయాలకు అర్థమయ్యేలా చేసిన చారిత్రాత్మక రోజని అభివర్ణించారు. "వైనాట్ 175" అన్న వాళ్లకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా కేవలం 11 సీట్లిచ్చి, రాష్ట్ర ప్రజలే ప్రజాస్వామ్య గౌరవాన్ని పెంచారని పేర్కొన్నారు. ఐదు కోట్ల ఆంధ్రులు తమ కలలు నెరవేర్చేది కూటమి ప్రభుత్వమేనని నమ్మి, సంచలనాత్మక తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న సుదినం ఈరోజని మంత్రి కొలుసు భావోద్వేగంతో ప్రకటించారు.

"రెండేళ్ల ప్రజాపాలనలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగింది మన కూటమి ప్రభుత్వం. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు, ఒడిదుడుకులు, అధికారపిచ్చి పట్టిన దొంగలముఠా, దగాకోరు పార్టీ అసత్య ప్రచారాలు, అసత్య ఆరోపణల మధ్య అన్నింటినీ అధిగమించి ప్రజల కోసం నిలబడింది కూటమి ప్రభుత్వం. ప్రభుత్వాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులకు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు. ఈ రెండేళ్ల పాలనలో ప్రభుత్వానికి వెన్నంటి నిలిచిన రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు, శుభాకాంక్షలు. రానున్న కాలంలో రాష్ట్ర ప్రజల సహాయసహకారాలతో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంది" అని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

### విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను

## రెండేళ్లలో గాడిన పెట్టాం

- జగన్ ట్రూ అప్ విధానాన్ని ట్రూ డౌన్‌గా మార్చిన ఘనత కూటమిది
- వచ్చే మూడేళ్లలోనూ విద్యుత్ చార్జీల పెంపు ఉండదు
- ఇంధన మంత్రి గొట్టిపాటి స్పష్టీకరణ



అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని ఇంధన మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా వచ్చే మూడేళ్లలోనూ ఎటువంటి విద్యుత్ ఛార్జీల పెంపులు, అదనపు భారాలు ఉండవని ఆయన హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను సర్వ నాశనం చేసిందని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. ఆర్థికంగానూ దెబ్బతీసి విద్యుత్ వ్యవస్థ మనుగడకే ముప్పు తెచ్చారన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికతతో రెండేళ్ల వ్యవధిలోనే విద్యుత్ శాఖను గాడిలో పెట్టామన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ నోట్ విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ట్రూ అప్ విధానాన్ని కూటమి ప్రభుత్వం ట్రూ డౌన్‌గా మార్చి చరిత్ర సృష్టించిందన్నారు. విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపకుండా 13 పైసలు ట్రూ డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూనే వినియోగదారులపై అదనపు భారాన్ని మోపకుండా చర్యలు చేపడుతోందని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించామని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంప్రదాయేతర ఇంధన రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 6 లక్షల సోలార్ కనెక్షన్లను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. అలాగే, ఆర్డీఎస్ఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలు తగ్గించడంతోపాటు విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపర్చేందుకు పెద్దఎత్తున సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. దీనితో విద్యుత్ అంతరాయాలు, లోఓల్టేజ్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని స్పష్టం చేశారు.

## నర్సీపట్నంలో అంగరంగ వైభవంగా సురభి వారి పౌరాణిక నాటక ప్రదర్శనలు



నర్సీపట్నం (చైతన్యరథం): ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జూన్ 14,15 తేదీలలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో అపూర్వమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో.. సుప్రసిద్ధ శ్రీ వినాయక నాట్యమండలి (సురభి) వారిచే భారీ పౌరాణిక నాటక ప్రదర్శనలను ఇక్కడ ఏర్పాటు చేశారు. స్పీకర్ స్వయం పర్యవేక్షణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ కార్యక్రమంలో, జూన్14వ తేదీ శనివారం నాడు సాయంత్రం 5గంటలకు 'మాయాబజార్' నాటకాన్ని, 15వ తేదీ ఆదివారం సాయంత్రం 5గంటలకు 'శ్రీపద్మావతి శ్రీనివాస కళ్యాణం' నాటకాన్ని ప్రదర్శించనున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారి చరిత్రను, మహిమలను భక్తులకు కళ్లకు కట్టినట్లు చూపించే ఉద్దేశంతో భారీ సినీ సెట్టింగ్స్‌తో ఈ దైవిక కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో శ్రీవారి కళ్యాణాన్ని పూజా కార్యక్రమాల రూపంలో వీక్షించిన భక్తులు, ఈసారి నాటక రూపంలో అద్భుతమైన సాంకేతిక విలువలతో, అచ్చం సినిమాను తలపించేలా చూడవచ్చని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఎంతో సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభి నాటక సంస్థకు ఉన్న ప్రత్యేకతను ఆయన వివరిస్తూ, ఒకప్పుడు వారి ప్రదర్శనలు చూడటానికి మన ప్రాంత ప్రజలు శ్రీకాకుళం, తిరుపతి వంటి దూరప్రాంతాలకు సైతం వెళ్లేవారని గుర్తుచేశారు. అటువంటి అరుదైన అవకాశం ఇప్పుడు నర్సీపట్నం వాసుల ముందుకు రావడం ఎంతో సంతోషకరమన్నారు. మునుపెన్నడూ చూడని విధంగా ఈ నాటక ప్రదర్శనలు అందరినీ అలరిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన సురభి నాటకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనలకు నర్సీపట్నం, మాకవరపాలెం తదితర ప్రాంతాల నుంచి నియోజకవర్గ ప్రజలు, మహిళలు, శ్రీవారి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ భారీ కార్యక్రమానికి దేవాదాయ శాఖ, స్థానిక పెద్దల సహకారం కూడా ఎంతో ఉందని, ప్రతి ఒక్కరూ ఈ పౌరాణిక నాటకాలను వీక్షించి, విజయవంతం చేయడంతో పాటు స్వామివారి కృపకు పాత్రులు కావాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.

## ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విద్యార్థులతో కలిసి యూనిఫామ్ ధరించి సందడి చేసిన డీఈవో గిడ్డి అప్పారావునాయుడు



చోడవరం (చైతన్యరథం): మనబడి-మన పండగ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి. చోడవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి అనకాపల్లి డీఈవో గిడ్డి అప్పారావునాయుడు హాజరయ్యారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఫైవ్ స్టార్ చాక్లెట్లు, యాపిల్స్ అందించి ఆత్మీయంగా పలకరించి స్వాగతం పలికారు. యూనిఫామ్ ధరించి విద్యార్థులతో కలిసి సందడి చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన, ఆధునిక విద్యను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ హైస్కూల్లో చేరిన విద్యార్థులతో డీఈవో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలకు అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తున్నాయని తెలిపారు.

## కొవ్వూరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

కొవ్వూరు (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి నియోజకవర్గ స్థాయిలో ఒకనెల - ఒక నియోజకవర్గం - నాలుగుసార్లు సందర్శనలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రత్యేక కార్యక్రమాన్ని కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, RDO K ఆనందరావుతో కలిసి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు చెందిన నియోజకవర్గ స్థాయి అధికారులు కూడా హాజరై ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## తల్లికి వందనం పథకం స్టేటస్ చెక్ చేసుకున్నారా?

- లబ్ధిదారులే నేరుగా అర్హత చెక్ చేసుకునే వీలు కల్పించిన ప్రభుత్వం
- అందుబాటులోకి https://bm-sgsw.ap.gov.in/BM/Schemeout వెబ్‌సైట్
- 2026- 26 విద్యా సంవత్సరానికి దాదాపు 68 లక్షల మందికి నిధులు జమ




ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులకు గుడ్ న్యూస్... తల్లికి వందనం నిధుల విడుదలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే తాజాగా తల్లికి వందనం నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వ వర్గాల నుంచి కీలక సమాచారం అందుతుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద ఒకటి నుంచి పన్నెండో తరగతి విద్యార్థుల తల్లుల బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే 2026-27 విద్యా సంవత్సరానికి కూడా తల్లికి వందనం నిధుల విడుదలపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని జూనియర్ కాలేజ్‌లు ఇప్పటికే ప్రారంభం కాగా... స్కూల్స్ ఈ నెల 12 నుంచి తెరుచుకున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం నిధులను ఎప్పుడు విడుదల చేస్తుందా? అనే ఉత్కంఠ కొనసాగుతుంది. తల్లికి వందనం పథకం నిధులను జూలైలో విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. గతేడాది జూన్ నెలలోనే తల్లి వందనం నిధులు విడుదల చేసినప్పటికీ... ఈ ఏడాది మాత్రం కొంత ఆలస్యంగా జూలై మొదటి వారంలో నిధులు విడుదల చేసేందుకు సర్కార్ రెడీ అవుతున్నట్టుగా తెలుస్తోంది. ఈ ఏడాది దాదాపుగా 68 లక్షల విద్యార్థులకు తల్లి వందనం పథకం కింద లబ్ధి చేకూరే అవకాశం ఉంది. తల్లికి వందనం పథకంకు సంబంధించి గతేడాది జారీ చేసిన నిబంధనలే ఈ ఏడాది కూడా కొనసాగనున్నాయి.

తల్లి వందనం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం... ప్రతి ఏడాది మొత్తం రూ. 15 వేలలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేలు జమ చేసి, మిగిలిన రూ.2 వేలు పాఠశాలల మెయింటనెన్స్ గ్రాంట్ కోసం కలెక్టర్ల ఆధ్వర్యంలోని బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తుంది. ఒక్కో విద్యార్థి తల్లికి రూ. 13 వేల చొప్పున సాయం బ్యాంకు ఖాతాల్లో వేస్తుంది. ఇద్దరు పిల్లలు ఉన్న తల్లులకు రూ.26 వేలు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులకు రూ.39 వేలు... నలుగురు పిల్లలు ఉన్న తల్లులకు రూ. 52 వేలు.. ఇలా అందిస్తుంది.

తల్లికి వందనం పథకం స్టేటస్ ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. **ఇందుకోసం https://bm-sgsw.ap.gov.in/BM/Schemeout వెబ్‌సైట్‌ను సందర్శించాలి.**

- అక్కడ ఆధార్ కార్డు నంబర్ ఎంటర్ చేసి, స్కీమ్ టైప్ డ్రాప్ డౌన్ నుంచి తల్లికి వందనం ఎంచుకోవాలి.
- అనంతరం ఇయర్ దగ్గర 2026-27 ఎంచుకుని గెట్ డీటెయిల్స్ మీద క్లిక్ చేయాలి.
- ఆ తర్వాత ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఆ ఓటీపీతో పాటు, స్క్రీన్ మీద కనిపించే క్యాప్చాను కూడా ఎంటర్ చేయాలి.
- అక్కడ సిటిజన్ డీటైల్స్ , ఫ్యామిలీ డీటైల్స్ , స్కీమ్ ఎలిజిబిలిటీ కాలిక్యులేటర్ అని కల్పిస్తాయి.
- అయితే స్కీమ్ ఎలిజిబిలిటీ కాలిక్యులేటర్ వద్ద అన్ని నిబంధనలకు Satisfied అని ఉంటే వారు తల్లికి వందనం పథకానికి అర్హులు అవుతారు.

## తుని ఏరియా ఆసుపత్రిలో యనమల దివ్య ఆకస్మిక తనిఖీలు



తుని (చైతన్యరథం): కాకినాడ జిల్లా తుని ప్రాంతీయ ఆసుపత్రిని 200 పడకలకు అప్ గ్రేట్ చేయిస్తానని ప్రభుత్వ విప్ యనమల దివ్య పునరుద్ఘాటించారు. నాలుగైదు నియోజకవర్గాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి అప్ గ్రేట్ విషయాన్ని చామవరం సభలో సీఎం దృష్టికి తీసుకుని వెళ్ళడం జరిగిందని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని యనమల దివ్య ఏరియా ఆసుపత్రిలో అకస్మిక తనిఖీలు చేసిన అనంతరం మీడియాకు చెప్పారు. రోజూ సుమారు ఆరువందల మందికి పైగా వైద్యసేవలు అందిస్తున్న ఏరియా ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య ఇవాళ మరోమారు ఆకస్మిక తనిఖీలు చేసారు. నేరుగా ఆసుపత్రికి వెళ్ళిన ఆమె ఎక్స్ రే విభాగాన్ని తనిఖీ చేసారు. ఎక్స్ రే తీయడానికి రెండు గంటలపాటు ఓ రోగి పడిగాపు పడ్డారన్న విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ఆమె స్పందించి తొలుత ఎక్స్ రే విభాగానికి వెళ్ళారు. అక్కడ అన్ని రికార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే పిర్యాదులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. అప్పుడప్పుడు విద్యుత్ ప్రొబ్లమ్ వల్ల సకాలంలో ఎక్స్ రేలు ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. సహజంగా ఎక్స్ రే ఇవ్వడానికి 15 నిమిషాలు సమయం సరిబోతుందని సిబ్బంది తెలియజేసారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా విద్యుత్ సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం పలు విభాగాల్లో కూడ తనిఖీలు చేసారు. రోగులను నేరుగా కలిసిన ఆమె వైద్యసేవలు, వైద్యులు పనితీరును అడిగి తెలుసుకున్నారు.

## "ఓటరు జాబితా పటిష్టంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది"



విజయవాడ (చైతన్యరథం): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR - Special Intensive Revision) కార్యక్రమాన్ని అత్యంత కీలకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 14వ డివిజన్‌లో డివిజన్ స్థాయి నాయకులతో గద్దె అనురాధ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల పరిశీలన ప్రక్రియపై పార్టీ శ్రేణులకు ఆమె సమగ్ర అవగాహన కల్పించారు. సమావేశంలో ఓటర్ల జాబితా సవరణలో పార్టీ శ్రేణుల పాత్ర, నకిలీ మరియు అనర్హ ఓట్ల గుర్తింపు, అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చే విధానం, బూత్ స్థాయి కార్యాచరణ, క్లస్టర్ మరియు యూనిట్‌ల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, నకిలీ మరియు అనర్హ ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయవచ్చన్నారు. ఓటరు జాబితా పటిష్టంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుందని, అందుకు ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జూన్ 15 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, కొత్తగా అర్హత పొందిన ఓటర్లను నమోదు చేయించాలని, మరణించినవారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను గుర్తించి ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**● నందిగామలో ప్రజాదర్బార్ చేపట్టిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): నందిగామ పట్టణం కాకానినగర్‌లోని తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యే ఎదుట నేరుగా వినిపించారు. తంగిరాల సౌమ్య ప్రజలను సానుకూలంగా ఆహ్వానించి, వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి సమస్యను వివరంగా అర్థం చేసుకుని, సంబంధిత అధికారులకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే సౌమ్య ప్రతి సమస్యపై స్పందించి, "ప్రజల సమస్యలు నా సమస్యలు" అని పేర్కొన్నారు. "ప్రభుత్వం ప్రజల కోసమే. వారి బాధలు తీర్చడం మా ప్రధాన బాధ్యత" అని ఆమె అన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో స్థానిక అధికారులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

# కోటిరెడ్డికి వినికిడి యంత్రాన్ని పంపిణీ చేసిన చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన రొడ్డ కోటిరెడ్డి వ్యక్తికి ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు వినికిడి యంత్రాన్ని అందజేశారు. చీఫ్ విప్ వారి కార్యాలయంలో తీవ్ర వినికిడి లోపంతో బాధపడుతున్న కోటి రెడ్డి సమస్యను తెలుసుకున్న జీవీ తక్షణమే స్పందించి, ఆయనకు ఈ యంత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు కోటి రెడ్డి కుటుంబ సభ్యులు చీఫ్ విప్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో చురుగ్గా నైరుతి రుతుపవనాలు

**● పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ**



ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. మరోవైపు ఉపరిత ఆవర్తనాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రభావంతో ఏపీలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) తెలిపింది. నైరుతి రుతుపవనాలు గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని తెలిపింది. రాబోయే 2-3 రోజుల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలులతో కూడిన చెదురుమదురు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు,పల్నాడు జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఇక, నైరుతి రుతుపవనాలు, విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో శుక్రవారం (జూన్ 12) రోజున రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ తెలిపింది. పోలవరం, అనకాపల్లి, కాకినాడ, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాలలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వచ్చే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడవద్దని సూచించింది.



# యోగసాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం




బాపట్ల (చైతన్యరథం): యోగా సాధనను ప్రతి ఒక్కరూ జీవన శైలిలో భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం బాపట్ల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని అందరితో కలిసి ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా సాధన చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. నేటి జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిళ్లను అధిగమించేందుకు యోగా దివ్య ఔషధంలా ఉపయోగపడుతుందని చెప్పారు. యోగాతో అనేక శారీరక ఇబ్బందుల నుంచి బయట పడచ్చొనని తెలిపారు. జీవితంలో యోగం భాగం కావాలన్నారు.
ఈ కార్యక్రమంలో డీఆర్ గంగాధర్ గౌడ్, యోగాంధ్ర నోడల్ అధికారి చంద్రశేఖర్, డీఎంహెచ్వో విజయమ్మ, డీపీవో ప్రభాకర్, డీసీహెచ్ఎస్ పద్మావతి, మహిళా స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధ మాధవి, సివిల్ సప్లైస్ డీఎం శ్రీలక్ష్మి, ఆర్డీవో హరి కుమార్, తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ హాసిని ఇతర జిల్లా అధికారులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవాలు

**●ఎమ్మెల్యే గళ్ళా మాధవి నాయకత్వంలో అభివృద్ధి పథంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. అదే సమయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపడుతున్న ప్రజా సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు, ప్రతి డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి పనిచేస్తున్నారని, మహిళలు, యువత, వృద్ధులు, పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గ్రీవెన్స్ కార్యక్రమాలు నిర్వహించడం, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయడం, కాలనీలు మరియు డివిజన్లలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. గత రెండేళ్లలో ఎన్డీయే ప్రభుత్వ పాలనతో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుండగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి నాయకత్వంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ గుంటూరు పశ్చిమను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డా. కల్పన మరియు తెలుగు మహిళ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైసీపీ మళ్లీ వస్తే ఈ రాష్ట్రానికి మనుగడ ఉండదు

**●భారత రాజకీయాల్లో చంద్రబాబు ఒక సూపర్‌స్టార్... కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షం**

**● ఎన్డీయే పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఇంద్రకీలాద్రిపై బుద్దా వెంకన్న పూజలు**



**ఎన్డీయే కూటమి పాలన రెండేళ్లు పూర్తియిన సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మకు సారె తీసుకువెళ్తున్న టీడీపీ నేత బుద్దా వెంకన్న**

విజయవాడ (చైతన్యరథం): సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ నేతలు వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో వన్‌టౌన్ చైనా వాల్ నుంచి ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం దుర్గగుడి ఘాట్ రోడ్డులోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి సారె సమర్పించి రాష్ట్ర శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.

**విజయవంతంగా రెండేళ్లు**

ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని అన్నారు. చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేలా శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలు ప్రత్యక్షంగా చూశారని, అందుకే ఆ పార్టీని ఘోరంగా ఓడించారని బుద్దా వెంకన్న విమర్శించారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అభివృద్ధి దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు కూటమికి 164 అసెంబ్లీ స్థానాలు ఇచ్చారని గుర్తుచేశారు.

**తప్పుడు ప్రచారం**

అమరావతి, విజయవాడ ప్రాంతాలు వరదలు వస్తే పూర్తిగా మునిగిపోతాయని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తులను ఎవ్వరూ అడ్డుకోలేరని, వరదలను కూడా రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్నారు. ఇటీవల భారీ వర్షాలకు హైదరాబాద్‌లో కూడా నీటిమునిగిన పరిస్థితులు కనిపించాయని పేర్కొన్నారు.

**76 ఏళ్ల వయసులోనూ..**

చంద్రబాబునాయుడు 76 ఏళ్ల వయసులోనూ రోజుకు 20 గంటల పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడుతున్నారని కొనియాడారు. భారత రాజకీయాల్లో చంద్రబాబు ఒక సూపర్‌స్టార్ అని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన వైసీపీ నేతలు అసెంబ్లీకి వెళ్లకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబునాయుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని అమ్మవారిని కోరుకున్నామని బుద్దా వెంకన్న తెలిపారు.

# రొట్టెల పండుగకు 20 లక్షల మంది భక్తులు

### మంత్రి నారాయణ సమీక్షలో అధికారులు, నిర్వాహకుల అంచనా



నెల్లూరు (చైతన్యరథం): జిల్లాలోని బారా షహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. రొట్టెల పండుగ సందర్భంగా ఏర్పాట్లపై నెల్లూరులో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు బారా షహీద్ దర్గాలో రొట్టెల పండగ జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఈ పండగకు దేశ విదేశాల నుంచి 16 లక్షల నుంచి 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మతసామరస్యానికి ప్రతీకగా ఈ రొట్టెల పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. బారా షహీద్ దర్గాకు 415 సంవత్సరాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. రొట్టెలు పట్టుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారని చెప్పారు. అందుకే ప్రతీ ఏడాది భక్తుల రద్దీ అంతకంతకు పెరుగుతోందన్నారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై చర్చించారు. అలాగే సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24వ తేదీ లోపు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవం

రాయచోటి (చైతన్యరథం): తిరుపతిలో శుక్రవారం ఘనంగా నిర్వహించిన "సుపరిపాలన, స్వర్ణాంధ్ర రెండేళ్ల విజయోత్సవ సభ"లో అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ మహాసభలో పీలేరుఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, మదనపల్లి శాసనసభ్యుడు షాజహాన్ బాషా, కమలాపురం శాసనసభ్యులు పుత్తా చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చదిపిరాళ్ల బుపేష్ రెడ్డి తదితర నాయకులతో కలిసి సభలో పాల్గొని కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ ప్రస్థానానికి సంఘీభావం తెలిపారు.

## ఉయ్యాల కాలువ ఉగ్రరూపం.. అల్లాడిన నెల్లూరు జనం!

### మంత్రి నారాయణ ఆదేశాలతో రంగంలోకి దిగిన ధర్మవరపు బృందం... యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

నెల్లూరు నగరంలో గంటపాటు కురిసిన విపరీతమైన వర్షం ఈదురు గాలుల వల్ల 47, 48 డివిజన్లలోని ఉయ్యాల కాలువ కట్ట పొంగి పొర్లింది. దీనివల్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడమే కాకుండా ఇళ్లలోకి కూడా చేరింది. సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర పట్టణ మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, 47,48వ డివిజన్ క్లస్టర్ ఇంచార్జ్ ధర్మవరపు సుబ్బారావు, 47వ డివిజన్ ప్రెసిడెంట్ గణేష్ అధికారులను వెంటబెట్టుకొని డివిజన్ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ,



గతంలో మంత్రి నారాయణ గారి ఆధ్వర్యంలో ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా కాలువలకు వాల్స్ మరియు స్లాబ్ వేసే పనులు చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత అకాల వర్షం వల్ల కాలువలు పొంగడంతో పాటు పలుచోట్ల చెట్లు విరిగి ఇళ్లపై, రోడ్లపై పడ్డాయని, నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా నీటిని తోడేసి, విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించేలా మున్సిపల్ సిబ్బందితో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని తెలిపారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కాలువ పనులు మరియు రోడ్డు మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా వారు ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మైనారిటీ నాయకులు షేక్ మహబూబ్ బాషా, వైస్ ప్రెసిడెంట్ మదనంబేటి మునిశేఖర్, బూత్ ఇన్‌చార్జ్‌లు కంచి కృష్ణ, షేక్ రాబియా స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మోగిన బడిగంటలు ... బాలల ఒడిలో వాలిన పుస్తకాలు

ఒంగోలు (చైతన్యరథం): ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలలు శుక్రవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. 48 రోజుల వేసవి సెలవులు గురువారంతో ముగిశాయి. దీంతో మళ్లీ బడి గంటలు మోగనున్నాయి. విద్యార్థులు స్కూళ్ల బాట పట్టనున్నారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది వేసవి సెలవుల్లోనే పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముమ్మరంగా చేపట్టారు. గతేడాది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఇప్పటికే చేరారు. జిల్లాలోని 1,357 ప్రాథమిక, 139 ప్రాథమికోన్నత, 439 హైస్కూళ్లు కలిపి 1,980 పాఠశాలల్లో 2,03,825 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు పొందారు. వీరిలో 1,02,024 మంది ప్రభుత్వ పాఠశాలల్లో, 2,444 మంది ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి 1,04,445మంది.. ప్రైవేటు పాఠశాలల్లో 99,357 మంది చేరారు. పాఠశాలలు పునఃప్రారంభ రోజైన శుక్రవారమే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేపట్టారు.





## వచ్చే రెండేళ్లూ పక్కాగా అభివృద్ధి ప్రణాళిక అమలు

### సీఎం చంద్రబాబు చొరవతో పనుల వేగం పెంచిన ప్రభుత్వ యంత్రాంగం

ఒంగోలు (చైతన్యరథం): ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో ప్రజలకు ఉపకరించే పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఉమ్మడి జిల్లా ప్రత్యేకించి పశ్చిమప్రాంత ప్రజల చిరకాలవాంఛ అయిన వెలిగొండ ప్రాజెక్టు వేగవం తమైంది. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాది నీటిని ఇవ్వాలన్న దృఢసంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ఆ మేరకు ప్రజల్లో కూడా నమ్మకం కలిగింది. మరో ప్రధానమైన జిల్లా పునర్విభజన జరిగింది. పశ్చిమప్రాంతంలో మార్కాపురం కేంద్రంగా నాలుగు నియోజకవర్గాలతో నూతన జిల్లా ఏర్పడింది. కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను తిరిగి ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలో చేర్చడం ప్రజలకు ఊరట నిచ్చింది. తాజాగా రాయలసీమ రీజియన్‌లో రూ.లక్ష కోట్లతో చేపడుతున్న హార్టికల్చర్ హబ్‌లో ఉమ్మడి జిల్లాను చేర్చడం ద్వారా ఈ ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను చూపింది. మరోవైపు రామాయ పట్నం పోర్టు తొలిదశ నిర్మాణాన్ని ఒక కొలిక్కి తీసుకురావడంతోపాటు పోర్టు కేంద్రంగా భారీ పెట్టుబడితో బీపీసీఎల్ ప్రాజెక్టు, మరికొన్ని పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. కనిగిరి నియోజకవర్గం కేంద్రంగా బీడు భూములను సైతం భారీగా లీజుకు ఇచ్చి రైతులకు ఉపకరించేలా కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాం ట్లను ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. ఆ ప్లాంట్లను మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలకు విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. దొన కొండ పారిశ్రామిక కారిడార్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు ప్రయ త్నాలు ఆశలు రేకెత్తిస్తున్నాయి. మొత్తంగా అటు వెలిగొండ, హార్టికల్చర్ హబ్‌ల ద్వారా వ్యవసాయ రంగం, వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉమ్మడి జిల్లాలో ఉపాధి మార్గాలు మెరుగుపడనున్నాయి. అలాగే గతం కన్నా రైలు, రోడ్డు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో కొంతమేర పురోగతి కనిపిస్తోంది. పభుత్వం దృష్టి సారించాల్సిన దీర్ఘకాల పెండింగ్ అంశాలు అనేకం ఉన్నాయి. ప్రత్యేకించి ఉమ్మడి జిల్లాకు తలమానికమైన ఒంగోలు డెయిరీ విషయంలో ప్రజాప్రభుత్వ వైఖరిపై పాడి రైతులు, రాజకీయవర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఒంగోలు డెయిరీకి సమాధి కట్టగా అధికారంలోకి వచ్చాక పునరుద్ధరిస్తామని పలుమార్లు చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారు. అయితే ఆదిశగా ఇప్పటి వరకూ ఒక్క ప్రయత్నం జరగ లేదు. ఆ అంశాన్ని వారు పట్టించుకోవడం లేదన్న చర్చ టీడీపీ వర్గాల్లోనే నడుస్తోంది. ఫలితంగా ఒంగోలుతోపాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న డెయిరీకి చెందిన కోట్లాది రూపాయల విలువైన భూములు, భవనాలు, మిషనరీ, ఇతర ఆస్తులు నిరర్థకంగా పడి ఉన్నాయి. అవి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఆంధ్రకేసరి యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు ఎప్పటికీ అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. కీలకమైన జల జీవన్ మిషన్ పరిధిలోని భారీ తాగునీటి పథకాల నిర్మా ణాలు, రామతీర్థం రిజర్వాయర్ ఎత్తు పెంపు, గుండ్లకమ్మ లో కొత్త చెక్‌డ్యాంల నిర్మాణం, ఒంగోలులో రూ.100 కోట్లతో భూగర్భ డ్రైనేజీ తదితరాలపై ప్రభుత్వం దృష్టిసారించి విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం జరుగుతోంది. ఇటీవల సంగమే శ్వర ప్రాజెక్టుకు రూ.165 కోట్ల కేటాయింపు, కొత్తపట్నం వద్ద రూ.441 కోట్లతో ఫిషింగ్ హార్బర్ మంజూరు కావడం ఆ ప్రాంతాల అభివృద్ధికి ఉపకరించనున్నాయి. ఇక ప్రభు త్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాల లబ్ధి ఆయా వర్గాలకు అందుతుండగా పెద్దసంఖ్యలో లబ్ధిదారులు వాటి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితికి చెక్ పడనుంది. రెండేళ్ల పాలన పూర్తిచేసుకుంటున్న సందర్భంగా పెండింగ్ అంశాలపై పాలక పెద్దలు దృష్టి సారిస్తున్నారు.



తిరుపతి దామినేడులో జరిగిన సుపరిపాలన, స్వర్ణాంధ్ర రెండేళ్ల విజయోత్సవ సభలో సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు తదితరులతో పూల నాగరాజు

# రెవిన్యూ యంత్రాంగం పనితీరు భేష్

### భూసమస్యల పరిష్కార వేదికలో కేడీసీసీ చైర్మన్




పోరుమామిళ్ల (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “ఒక నెల, ఒక నియోజకవర్గం, నాలుగు సందర్శనలు” కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల మండల కేంద్రంలోని పద్మావతి గ్రాండ్‌లో భూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ, డీకేటీ భూములు అధికంగా ఉండటంతో భూ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనన్, బద్వేల్ ఆర్డీవో చంద్ర మోహన్ , మార్కెట్ కమిటీ చైర్మన్ సుప్రజతో కలిసి పాల్గొన్న ఆయన, నాలుగు వారాల వ్యవధిలో నమోదైన ప్రతి ఫిర్యాదును పరిష్కరించే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 300కు పైగా రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు నమోదు అయ్యాయని, వాటన్నింటినీ నిర్ణీత గడువులో పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సైఆర్‌ను విజయవంతం చేయాలి

### నూరు శాతం మ్యాపింగ్ జరగాలి : ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలనీ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఈరోజు గోరంట్ల కార్యాలయం నందు ‘సర్’ కార్యక్రమంపై కొంతమూరు, కోలమూరు, రాయుడుపాకల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జి లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 14వ తేదీ వరకు జరిగే సర్ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఏజంట్స్ (బి ఎల్ ఏ) ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి ఓటర్ల జాబితాలో తేడాలు రాకుండా , టిడిపి సానుభూతి పరుల ఓట్లు పోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గతంలో 59 శాతం మ్యాపింగ్ చేశామని, ఇప్పుడు 90శాతం దాటాలని ఆయన అన్నారు. 2లక్షల 72వేల ఓటర్లతో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం రాష్ట్రంలో పెద్ద నియోజక వర్గంగా ఉందని గోరంట్ల అన్నారు. 267బూత్ లుండగా, 301కి చేరబోతున్నాయన్నారు. వలసలు వచ్చినవారి ఓట్లు కూడా కలుపుకోవడంలో సర్ కార్యక్రమంలో శ్రద్ధ వహించాలన్నారు. చాలామంది రూరల్ నియోజకవర్గంలోకి చేరారని చనిపోయిన వారి ఓట్లు తీసివేయించడం, ఓట్లు లేనివారికి ఓటర్లుగా చేర్పించడం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, సొసైటీ అధ్యక్షులు అడ్డాల శీను, తాడేపల్లి నాగరాజు, ఉండవల్లి బంగారాజు, యూనిటీ ఇన్చార్జీలు, బూత్ ఇన్చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలో చేరిన వారికి అండగా ఉంటాం

### ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి భరోసా

డోన్ (చైతన్యరథం): టీడీపీలోకి వచ్చిన వారి నమ్మకాన్ని వమ్ముచేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. పెద్దపూదిళ్ల గ్రామంలో వైసీపీకి చెందిన దాదాపు వంద కుటుంబాలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. కమతం భాస్కరెడ్డి, చంద్రపల్లికి చెందిన మహ్హ?షరెడ్డి, నక్కలవాగుపల్లి చెందిన వైసీపీ నాయకులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వారందరికి కోట్ల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి, లక్ష్మినారాయణయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, అలేబాదు పరమేష్, రాజా నారాయణమూర్తి, సుదర్శన్, ఆర్ఈ నాగరాజు. ఖాజాపీర్; కుమ్మరి సుధాకర్, రామ్మోహన్‌యాదవ్, కాంతారెడ్డి, ఓబులేసు, మహేష్, చంద్రబోస్ పాల్గొన్నారు.

### రైతుకు సేవలందించడమే లక్ష్యం

రైతులుర ఆర్థికాభివృద్ధి సాధించేలా మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల అన్నారు. గురువారం పశుసంవర్దక శాఖ ఆధ్వర్యంలో విలేజ్ హెర్డ్ ఫర్టిలిటీ రిజిస్టర్‌ను ఆవిష్కరిచారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

కర్నూలు (చైతన్యరథం): ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందిని కలెక్టర్ డాక్టర్ ఏ సిరి ఆదేశించారు. గూడూరులోని 4, 6వ స్వర్ణ వార్డు కార్యాల యాలను కలెక్టర్ తనిఖీ చేసి అక్కడ సిబ్బంది అందిస్తున్న సేవలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. ఇందులో భాగంగా మహిళా పోలీ సులు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై కలెక్టర్ ఆరా తీశారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమాల ద్వారా ఎంత మందికి అవగాహన కల్పించారో, వార్డు పరి?ధిలో ఉన్న మైనర్ బాలికల సంఖ్య ఎంత, వారికి సంబంధించిన రికార్డులు ఎందుకు నిర్వహించలేదని మహిళా పోలీసులను ప్రశ్నించారు. మైనర్ బాలికలకు సంబంధించి సమగ్ర రికార్డులను తప్పనిసరిగా నిర్వహించి వారి విద్య, ఆరోగ్యం, భద్రత అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు ఏఐ ఆధారిత ఈసీడీ స్క్రీనింగ్, చిన్నారుల ఆరోగ్య, అభివృద్ధి లోపాల గుర్తింపు, బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక శిక్షణా కార్యక్ర మాలు నిర్వహించాలని స్వర్ణగ్రామ, వార్డు అధికారి బాస్కర్ నాయుడు ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే శాస్త్రీయ పద్ధతుల్లోనే చెత్త నిర్వహణ చేపట్టాలని, వర్మీకంపోస్టు తయారీ నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఆర్డీవో సందీప్ కుమార్, స్వర్ణగ్రామ, వార్డు అధికారి భాస్కర్ నాయుడు, డీపీవో భాస్కర్, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, కమిషనర్ రమేష్ బాబు, ఏవో దస్తగిరి రెడ్డి ఉన్నారు. పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువులు సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల వివరాలను ఏ విధంగా నమోదు చేసి యూరియా సరఫరా చేస్తున్న ప్రక్రియను కలె క్టర్ స్వయంగా పరిశీలించి, తగు సూచనలు చేశారు.

### పాడి పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలి

కర్నూలు అగ్రికల్చర్: రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఏ.సిరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువుల సమూహం పునరు త్పత్తి పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ పాల ఉత్పత్తిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఇందు కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను లాభాల బాట పట్టించేందు కోసం వివిద పథకాలు, కార్యక్రమా లను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జేడీ రాజ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఒమన్‌లో కూలిన కలల సౌధం

## విగతజీవుడిగా మారిన సురేష్



**ఒమన్/విశాఖపట్నం:** గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చమురు ట్యాంకర్ పేలిన ఘటనలో ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోయారు. ట్యాంకర్ ఇంజిన్లో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఫిట్టర్ శివానంద్ చౌరాసియాలతో పాటు విశాఖపట్నానికి చెందిన చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ (44) అక్కడికక్కడే మరణించారు. సురేష్ మృతిని న్యూఢిల్లీలోని ఆంధ్రా భవన్ అధికారులు, భారత విదేశాంగ శాఖ ప్రతినిధులు ధ్రువీకరించారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఘర్షణల్లో భారతీయ మెరైన్ ఉద్యోగులు బలికావడంపై సర్వత్రా దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. నౌకలో ఉన్న మిగిలిన 21 మంది భారతీయ సిబ్బందిని సురక్షితంగా రక్షించినట్లు కేంద్ర ఓడరేవులు, రవాణా శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ స్పష్టం చేశారు. మరణించిన నావికుల పార్థివదేహాలను వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకు రావడానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం వేగవంతం చేసింది. సురేష్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా విశాఖపట్నం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ఆంధ్రా భవన్ అధికారులు అవసరమైన దౌత్యపరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



## సురేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**



అమరావతి (చైతన్యరథం): ఒమన్ తీరంలో జరిగిన దుర్ఘటనలో విశాఖ వాసి, చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ మృతి చెందడం నన్ను ఎంతో బాధించింది. అతడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మాటిస్తున్నాను. సురేష్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. సురేష్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత రాయబార కార్యాలయం, ఒమన్ అధికారులతో సంప్రదింపులు జరపాలని ఇప్పటికే ఆదేశాలిచ్చాము.

## ఇలా జరుగుతుందని ఊహించలేదు

"వీడియో కాల్ చేసే అవకాశం లేకపోయినా ప్రతిరోజూ గుడ్ మార్నింగ్ మెసేజ్ మాత్రం పంపేవారు... జూన్ 9న ఆయనతో చివరిసారి మాట్లాడాను... నౌక చుట్టూ దాడులు జరుగుతున్నాయి... నాకేం కాదు, సేఫ్‌గా ఇంటికొస్తాను. మన పెళ్లిరోజు బాగా జరుపుకుందాం అన్నారు. కానీ ఇలా శవమై వస్తారని ఊహించలేదు" అని సురేష్ భార్య భార్గవి తన ఇద్దరు పిల్లలను పట్టుకుని గుండెలవిసేలా రోదించింది. 'ఐదు నెలలుగా నౌకలో విధుల్లో ఉన్న మావాడు సెలవుపై ఇంటికి రావడానికి ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి ఇచ్చారు. ఈలోపు ఈ దారుణం జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

**....సురేష్ భార్య భార్గవి**



## ప్రేమకు సాక్ష్యంగా...

విశాఖలోని శ్రీహరిపురంలో ఉన్న ఆయన నివాసానికి బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు చేరుకున్నారు. ఇంట్లోని గోడలపై సురేష్, భార్గవి కుటుంబ ఫొటోలు కనిపిస్తున్నాయి. ఇంట్లో షెల్ఫుల నిండా ఉన్న ఆటబొమ్మలు సురేష్, భార్గవి దంపతులు పిల్లలపై చూపి స్తున్న ప్రేమకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

సురేష్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్గవి అక్క, బావ మరణించడంతో వారి ఇద్దరు కుమార్తెల బాధ్యతను కూడా సురేష్ కుటుంబమే తీసుకుంది. ప్రస్తుతం నలుగురు పిల్లల భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "కుటుంబం మొత్తం ఆయన సంపాదనపైనే ఆధారపడి ఉంది. ఇప్పుడు పిల్లలను ఎలా చదివించాలి, ఎలా పెంచాలన్నదే అర్థం కావడం లేదు" అని భార్గవి ఆవేదనతో అన్నారు.



## రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

**ప్రవాసాంధ్రుల సాధికారిత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి (చైతన్యరథం): ఒమన్ తీరంలో విశాఖకు చెందిన మెరైన్ ఇంజనీర్ పట్నాల సురేష్ మృతి చెందడం దురదృష్టకరం. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. సురేష్ భౌతికకాయాన్ని రప్పించేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. అతడి సురేష్ కుటుంబానికి సాయం చేయాలని సీఎం సూచించారు. భారత్, ఒమన్ ఎంబసీలతో ఏపీ భవన్ ప్రత్యేక చర్చలు జరుపుతూ మానిటరింగ్ చేస్తోంది. సురేష్ మృతదేహం విశాఖ పట్నం వచ్చే వరకు పర్యవేక్షణ చేయ డంతో పాటు ఆ కుటుంబానికి ఏ సాయం కావాలన్నా చేయాలని ఏపీఎన్ఆర్టీ అధికారులకు సూచించాము.

# పర్యావరణ స్పృహ-సామాజిక బాధ్యత

**గ్రేటర్ చికాగో ఇండియన్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 'అడాప్ట్-ఎ-హైవే'**

**అరోరా నగరంలో రోడ్డును శుభ్రం చేసిన ప్రవాస భారతీయులు**

**ఆదర్శంగా నిలిచిన భారతీయ యువ వాలంటీర్లు**

**అరోరా (ఇల్లినాయిస్):** అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం అరోరా నగరంలో గ్రేటర్ చికాగో ఇండియన్ కమ్యూనిటీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అడాప్ట్-ఎ-హైవే' పరిశుభ్రత కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. తాము దత్తత తీసుకున్న న్యూయార్క్ స్ట్రీట్ కూడలి నుంచి బెన్నెట్ ప్లేస్ కూడలి వరకు సుమారు రెండు మైళ్ల ఈవోలా రోడ్డు పొడవునా ఈ క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక రహదారులను శుభ్రంగా, సురక్షితంగా, అందంగా ఉంచాలనే సంకల్పంతో అన్ని వయసుల వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా GCICకి చెందిన భారతీయ యువ వాలంటీర్లు అత్యంత క్రియాశీలక పాత్ర పోషించారు. సమాజ సేవలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన యువ వాలంటీర్లు ధ్రువ్ సదునేని, సుశాంత్ నైనప్పగారి, సాత్విక్ నైనప్పగారి, మోహిత్ గజ్జెల, సాత్విక గజ్జెల, విహాన్ బహల్, సుతన్ రాజన్‌లను GCIC ప్రత్యేకంగా అభినందించింది. వారి కఠోర శ్రమ, అంకితభావం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంది. కమ్యూనిటీ సేవలో భాగస్వాములైన పెద్దలు అశ్విని మహంత, రాజన్ రంగసామి, భారతి రాజన్, జగన్నాథ వేదుల, సురేష్‌లకు సంస్థ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ క్లీనప్ డ్రైవ్‌లో భాగంగా వాలంటీర్లందరూ ఎంతో శ్రమించి రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. తద్వారా ఆ ప్రాంత సౌందర్యాన్ని కాపాడటమే కాకుండా స్థానికుల్లో పర్యావరణ స్పృహ, సామాజిక బాధ్యతను పెంపొందించారు. సమాజ హితం కోసం అందరూ కలిసికట్టుగా అడుగులు వేస్తే ఎంతటి సానుకూల మార్పు తీసుకురావచ్చో ఈ కార్యక్రమం నిరూపించింది. మరిన్ని కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ.. రాబోయే తరాల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తుందని నిర్వాహకులు ప్రకటించారు.










# పశ్చిమ దేశాలది ద్వంద్వ వైఖరి

- ఫిన్‌ల్యాండ్ చర్చావేదికలో ఎండగట్టిన విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ: పశ్చిమదేశాల ద్వంద్వ వైఖరిని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మరోసారి ఎండగట్టారు. రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. యూరప్‌లోని ఫిన్లాండ్ దేశంలో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలే.. భారత్ ప్రత్యర్థులకు ఆయుధాలను విక్రయించిన విషయాన్ని జైశంకర్ గుర్తుచేశారు. ఆ ఆయుధాలతోనే భారత్‌పై దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈసందర్భంగా మన దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు రష్యా నుండి చమురు కొనుగోలు చేయాలని అమెరికా కూడా చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, దీటుగా బదులిచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగే పరిస్థితి ఉంటూ బాగుండేది. అయితే మా శత్రు దేశాలకు ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. అయినప్పటికీ ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారత్ చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తామన్నారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

## మతం మారిన దళితులకు రిజర్వేషన్లపై...

# జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక సిద్ధం



న్యూఢిల్లీ: మతం మారిన దళితులకు రిజర్వేషన్ల అమలుపై కేంద్రం నియమించిన కమిటీ నివేదిక సిద్ధం చేసింది. ఈ అంశంపై అధ్యయనానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంతో కేంద్రం కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఈ కమిషన్ అందజేయనుంది. ఈ అంశాలపై దాదాపు నాలుగేళ్ల పాటు సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ నివేదికకు జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ రూపొందించింది.

జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై ఈ కమిషన్ అధ్యయనం చేసింది. ప్రస్తుతం ఈ కమిషన్ నివేదిక ముద్రణ దశలో ఉంది. మరి కొద్ది రోజుల్లో కేంద్రానికి ఈ నివేదికను కమిషన్ అందజేయనుంది. ఈ నెల 10వ తేదీతో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ గడువు ముగిసింది. అయితే మరో 10 రోజులపాటు ఈ కమిషన్ గడువును కేంద్రం పొడిగించింది.

మతం మారిన తర్వాత కూడా దళితులు సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారా? అనే అంశంపై ప్రజల్లోకి వెళ్లి ఈ కమిషన్ ఆరా తీసింది. 1950 నాటి రాజ్యాంగం ఉత్తర్వు ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాల్లోని దళితులకు మాత్రమే ఎస్సీ హోదా ఇస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ మతాల్లోని దళితులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని చాలా కాలంగా దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఇస్లాం, క్రైస్తవ మతాల్లో కుల వ్యవస్థ లేదంటూ ఇప్పటికే సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇస్లాం, క్రైస్తవ మతాల్లో చేరిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని ఇటీవల సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన విషయం విదితమే. ఈ కమిషన్ సిఫార్సులపై దేశవ్యాప్తంగా అటు రాజకీయాల్లోనూ, ఇటు సామాజిక వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# బీహార్‌లో విచిత్రం

## 132 అడుగుల టవర్ మాయం



బక్సర్: సాధారణంగా విలువైన ఆభరణాలు, వస్తువులు.. వాహనాలు చోరీకి గురవుతుండటం చూస్తుంటాం. కానీ, బీహార్లో మాత్రం వింత ఘటన చోటుచేసుకుంది. బక్సర్ జిల్లాలో ఏకంగా ఓ భారీ మొబైల్ టవర్ తోపాటు జనరేటర్ మాయం కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

బక్సర్‌కు సమీపంలోని దుమ్రావ్ పట్టణంలో 2010లో ఓ ప్రైవేటు టెలికాం సంస్థ 132 అడుగుల టవర్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం స్థలం యజమాని హరేనాథ్ యాదవ్‌తో 12 ఏళ్ల కాలానికి ఒప్పందం చేసుకుంది. అయితే, అది 2022 తో ముగిసిపోయింది. అప్పటి నుంచి యజమానికి ఆ కంపెనీ నుంచి చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో ఆయన టెలికాం సంస్థకు పలుమార్లు నోటీసులు పంపించాడు. అయినప్పటికీ ఎటువంటి స్పందన లేదని సమాచారం.

ఈ క్రమంలోనే ఇటీవల మరమ్మతుల కోసం అక్కడకు చేరుకున్న కంపెనీ ప్రతినిధులు.. జనరేటర్తో సహా టవర్ లేకపోవడం చూసి అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, సుదీర్ఘ కాలంగా టవర్ ఇక్కడే ఉందని, గత 15-20 రోజులుగానే కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ పని ఎవరు చేసుంటారా.. అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని, స్థలం యజమానిని కూడా ప్రశ్నిస్తామని జిల్లా పోలీసులు తెలిపారు.

# టాటాలను తిరిగి బెంగాల్‌కు తీసుకొస్తాం6



కోల్‌కతా: టాటాలను తిరిగి పశ్చిమబెంగాల్‌కు తీసుకువస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. భూసేకరణపై నిరసనల కారణంగా 2008లో సింగూర్ నుంచి టాటా మోటార్స్ నానో ప్రాజెక్ట్ వైదొలగిన తర్వాత ఆ సంస్థ తిరిగి బెంగాల్‌కు రాలేదన్నారు. దాదాపు 17ఏళ్ల అనంతరం బెంగాల్ పారిశ్రామిక పునరుద్ధరణలో భాగంగా రాష్ట్రంలో పెద్దఎత్తున టాటా గ్రూప్ పెట్టుబడులు తీసుకురావడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. త్వరలో బెంగాల్ పారిశ్రామిక వైభవాన్ని పునరుద్ధరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. గతంలో సింగూర్, నందిగ్రామ్ ఆందోళనలకు దారితీసిన తప్పులను పునరావృతం చేయకుండా పెట్టుబడులను ఆకర్షించి, ఉద్యోగాలు సృష్టిస్తామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

2006లో పశ్చిమబెంగాల్ లోని హుగ్లీ జిల్లా సింగూర్లో టాటా మోటార్స్ 'నానో' కార్ల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటుచేయడానికి అప్పటి వామపక్ష ప్రభుత్వం దాదాపు వెయ్యి ఎకరాల భూమిని సేకరించింది. అయితే, బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఉద్యమం జరిగింది. తీవ్ర నిరసనల కారణంగా 2008 అక్టోబరులో టాటా గ్రూప్ ఆ ప్రాజెక్టును బెంగాల్ నుంచి గుజరాత్‌కు తరలించింది. 2016లో దీనిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ భూసేకరణను రద్దు చేసింది.

## కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ

# ఓటు గల్లంతు



న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత స్మృతి ఇరానీ పేరు అమేథీ జిల్లాలోని మైదాన్ మైవా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా నుంచి గల్లంతైంది. 2024 లోక్‌సభ, 2022 అసెంబ్లీ ఓటర్ల జాబితాలో ఇదే ప్రాంతం నుంచి ఆమె పేరు ఉంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఓడించి 2019 నుంచి 2024 వరకూ అమేథీ నియోజకవర్గానికి స్మృతి ఇరానీ ప్రాతినిధ్యం వహించారు. 2019 పార్లమెంటరీ ఎన్నికల్లో గెలుపు అనంతరం అమేథీ జిల్లా గౌరీగంజ్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మైదాన్ మైవాలో ఆమె ఒక ఇల్లు కట్టుకున్నారు. ఆ గ్రామ ఓటరుగా కూడా పేరు నమోదైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్కడి నుంచే ఆమె తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత కిషోరి లాల్ శర్మ చేతిలో ఓటమి చవిచూశారు.

కాగా, ఈ నెల 10వ తేదీన పంచాయతీ ఓటర్ల జాబితాను ప్రకటించగా అందులో స్మృతి ఇరానీ పేరు కనిపించలేదు. దీనిపై ప్రస్తుతం విచారణకు ఆదేశించినట్టు అమేథీ జిల్లా మెజిస్ట్రేట్ సంజయ్ చౌహాన్ మీడియాకు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాతే అసలు కారణం తెలుస్తుందని చెప్పారు. బీజేపీ అమేథీ జిల్లా అధ్యక్షుడు సుధాన్షు శుక్లా మాట్లాడుతూ, పంచాయతీ ఓటర్ల జాబితాలో స్మృతి ఇరానీ పేరు చేర్చాల్సిందిగా దరఖాస్తు ఇచ్చామని, సీనియర్ అధికారులు దీనిని పరిశీలిస్తున్నారని చెప్పారు. వెరిఫికేషన్ అనంతరం ఓటర్ల జాబితాలో పేరు చేరుస్తామని అధికారులు హామీ ఇచ్చినట్టు చెప్పారు.

# సుప్రీంలో మీనాక్షికి ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించటం అక్రమమంటూ ఆమె వేసిన పిటిషన్ ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్ ను విచారించింది. మీనాక్షి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. కనీసం రెండేళ్లు జైలు శిక్ష పడే క్రిమినల్ కేసులు కూడా ఆమె పై లేవని పేర్కొన్నారు. కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయన్నారు. వాదనలు విన్న అనంతరం.. నామినేషన్ తిరస్కరణ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని ధర్మాసనం స్పష్టంచేసింది. గతంలో అలాంటి తీర్పులు ఏమైనా ఉంటే కోర్టు ముందు పెట్టాలని సూచించింది. రిటర్నింగ్ అధికారి ఒకసారి అభ్యర్థి నామినేషన్ ను తిరస్కరిస్తే.. దానిపై ఎన్నికల కమిషన్ ను ఆశ్రయించడమే సరైన మార్గమని పేర్కొంది. ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదంటూ దాన్ని కొట్టివేసింది.

మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ సీటుకు కాంగ్రెస్ తమ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌ను ప్రతిపాదించింది. అయితే, రాజ్యసభ సభ్యత్వానికి ఆమె దాఖలు చేసిన నామినేషనను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షిపై తెలంగాణలో ఓ కేసు నమోదైందని.. దాన్ని ఆమె తన నామినేషన్ పత్రాల్లో దాచిపెట్టారని రాజ్యసభ మూడో స్థానానికి పోటీ చేసిన భాజపా అభ్యర్థి మహేశ్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె నామినేషన్ ను ఆర్వో తిరస్కరించారు. దీన్ని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఆమెపై ఎలాంటి కేసు నమోదు కాలేదని.. కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని వాదించింది. ఈ నేపథ్యంలోనే రిటర్నింగ్ అధికారి తన నామినేషన్ను తిరస్కరించడాన్ని ఆమె సుప్రీంలో సవాల్ చేయగా..తాజాగా అక్కడ ఆమెకు ఎదురుదెబ్బ తగిలింది.

# పశ్చిమాసియా సంక్షోభానికి తెర!

## ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందన్న ట్రంప్

పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడనున్నట్లు కన్పిస్తుంది. అణ్వాయుధాలు వదులుకునేందుకు ఇరాన్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడుల్ని విరమించుకుంటున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, ఆ దేశ అగ్రనాయకత్వం తమ ప్రతిపాదనలకు అంగీకరించిందని చెప్పారు.దీంతో ఈ వారాంతంలో ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేయనున్నట్లు తెలిపారు. ఓవెల్ ఆఫీసులో విలేకరులతో -మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ గొప్ప ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇది తుది దశలో ఉందన్నారు. అణ్వాయుధాలు వదులుకునేందుకు ఆ దేశం అంగీకరించిందని తెలిపారు. ఈ ఒప్పందంతో అది ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండబోదన్నారు. డీల్ పై సంతకాల తర్వాత హార్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందన్నారు. దీంతో ప్రపంచ ఇంధన మార్కెట్లపై నెలకొన్న ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ప్రతిపాదిత ఒప్పందానికి ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొత్తాబా ఖమేనీ ఆమోదించారని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఒప్పంద అంశాలకు ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, తుర్కియే, పాకిస్థాన్, బహ్రెయిన్, ఈజిప్టు కూడా సమ్మతి తెలిపాయని సామాజిక మాధ్యమ పోస్టు ద్వారా వెల్లడించారు. ఇక జరగాల్సింది సంతకాలేనని చెప్పారు. అది ఏ రోజు, ఎక్కడ అనేది త్వరలో ప్రకటిస్తానన్నారు. వాటి వివరాలేమిటనేది చెప్పలేదు. ఒప్పందం పూర్తిస్థాయిలో ఆచరణ రూపంలోకి వచ్చేవరకు ఇరాన్ ఓడరేవులపై తమ దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టంచేశారు. యూరప్‌లో ఈ వారాంతంలో డీల్ పై సంతకాలు జరగొచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హాజరుకావొచ్చని పేర్కొన్నారు. కాగా.... ఒప్పందం విషయంపై ఇరాన్ విభిన్నమైన ప్రకటన చేసింది. దీనిపై తాము ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి పేర్కొన్నారు. అయితే అమెరికాతో ఒప్పందం కుదిరినట్లు ఇరాన్‌కు చెందిన అధికారిక మీడియా 'ఫార్స్ న్యూస్ ఏజెన్సీ' కూడా వెల్లడించింది.

**'యురేనియం'పై తగ్గి..**

ఇరాన్‌తో ఒప్పందం గురించి గతంలో కూడా ట్రంప్ పలుమార్లు ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ.. ఈసారి మాత్రం ఒప్పందం ఖరారయ్యే



సంకేతాలే కన్పిస్తున్నాయి. ఇందుకోసం ట్రంప్ ఓ మెట్టు దిగి మరీ ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈమేరకు అమెరికా విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఒక అంతర్జాతీయ మీడియా సంస్థ సంచలన కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని శుద్ధి చేసిన యురేనియం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశం చేతుల్లో ఉండొద్దని ట్రంప్ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దాన్ని అమెరికాకు అప్పగించాలని లేదంటే నాశనం చేయాలని ఆయన అంతకుముందు చెప్పారు. అయితే, తాజా చర్చల్లో దీనిపై ట్రంప్ కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించినట్లు సమాచారం. అయితే, అది ఐరాస తనిఖీ బృందాల పర్యవేక్షణలోనే ఉండాలని షరతు విధించారు. ఇక, అణు కార్యక్రమాలపై ఇరాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా.. అది అమెరికాతో రెండో డీల్ కుదిరిన తర్వాతేనని ట్రంప్ మరో షరతు విధించినట్లు తెలుస్తోంది.

**డీల్ ప్రతిపాదనలు..**

తాజా అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లోపు హార్మూజ్ జలసంధిని ఎలాంటి టోల్ రుసుములు లేకుండా నౌకల రవాణాకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా.. అమెరికా ఈ జలమార్గంలో నిర్బంధాన్ని ఎత్తివేయనుంది. ఇక, హార్మూజ్‌ను తెరిచిన తర్వాత 60 రోజుల పాటు ఇరాన్‌కు ఆంక్షల మినహాయింపును అమెరికా కల్పించనుందని తెలుస్తోంది. అంటే ఇరాన్ చమురు విక్రయాలు చేపట్టేందుకు అనుమతులివ్వనుంది. ఆ తర్వాత ఇరాన్ ప్రవర్తనను బట్టి ఈ మినహాయింపులను మరికొన్ని రోజులు పొడిగించే అంశాన్ని కూడా అమెరికా పరిశీలించనుంది.

**ఐరోపాలో డీల్..**

ఇరాన్-అమెరికా మధ్య ఈసారి డీల్ జెనీవాలో జరగనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దీనిపై సంతకాలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే పర్యటన ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయట. అమెరికాకు చెందిన నాలుగు ఎయిర్‌ఫోర్స్ సీ-17 విమానాలు ఇప్పటికే యూరప్‌కు బయల్దేరాయి.ఇందులో వాన్స్ పర్యటనకు అవసరమైన వాహనాలు, ఇతర పరికరాలను తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ వారాంతంలోగా డీల్ కుదిరే అవకాశు ఉన్నట్లు తెలుస్తోంది.

యూఏఈ, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్ అధికారుల మధ్య బుధవారం రాత్రి కొన్ని గంటల పాటు చర్చలు జరిపాయి. ఇందులో ఒప్పందంపై ఇరుదేశాలు ఓ అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనలను ఇరాన్ అంగీకరించిందని, ఇక సంతకాలే తరువాయి అని ఆయన వెల్లడించారు. అయితే దీనిపై ఇరాన్ మాత్రం అధికారిక ప్రకటనేదీ చేయలేదు. ఈ ఒప్పందంలోని అంశాలను టెహ్రాన్ ప్రతినిధులు కూడా సమ్మతించారని సమాచారం.

**నెతన్యాహు ప్రశంసలు..**


ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ట్రంప్ ఫోన్లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా ఇరాన్ డీల్ విషయం పై నెతన్యాహు ట్రంప్ పై ప్రశంసలు కురిపించారు. ప్రతిపాదిత ఒప్పందానికి సంబంధించిన విషయాలను ఇరువురి నేతలు చర్చించుకున్నారు. ఈ డీల్‌లో ఇజ్రాయెల్ భాగం కాదని ఆ దేశ ప్రధాన కార్యాలయం పేర్కొంది. అయినప్పటికీ.. శుద్ధిచేసిన యురేనియంను తొలగించడం, క్షిపణి ఉత్పత్తులపై పరిమితులు విదించడం వంటి అంశాలు తుది ఒప్పందంలో ఉంటాయని ట్రంప్ హామీ ఇచ్చినట్లు తెలిపింది.

**భారత నౌకలపై దాడులు క్రూరమైనవి: ఇరాన్**

భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా జరిపిన దాడులను ఇరాన్ తీవ్రంగా బండించింది. భారతీయుల మృతికి కారణమైన ఈ దాడులను క్రూరమైనవిగా -బఘాయీ అభివర్ణించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు సానుభూతి -వ్యక్తంచేశారు. ప్రపంచ శాంతి, భద్రతకు ముప్పుతో పాటు.. నౌకాయాన స్వేచ్ఛకు అంతరాయం కలిగిస్తోన్న అమెరికా చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని పిలుపునిచ్చారు.

# నాటోకు సాయంలో భారీ కోత

**- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యోచన**



ఇరాన్ యుద్ధంలో తనకు సహకరించకుండా దూరంగా ఉన్న ఐరోపా దేశాల విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. నాటో కూటమికి అందిస్తోన్న సహాయంలో కోత విధించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదనలు రచిస్తోంది. ఐరోపాలో నాటో కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచే విమానాలు, యుద్ధనౌకలను గణనీయంగా తగ్గించాలని అమెరికా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యం తన ఆలోచనను గనక అమలు చేస్తే.. సుదూర దాడులు చేయడం, నిఘా వంటి అంశాల్లో నాటో సామర్థ్యాలు పరిమితం కానున్నాయని తెలుస్తోంది.

అమెరికా తన ప్రణాళికలో భాగంగా ఎఫ్-16, ఎఫ్-15ఈ ఫైటర్ జెట్ల సంఖ్య 150 నుంచి 100కు తగ్గొచ్చు. అలాగే, సముద్ర నిఘా విమానాల సంఖ్యను 26 నుంచి 15కు కుదించొచ్చు. ఐరోపాలో అందుబాటులో ఉన్న ఎనిమిది రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ విమానాలను ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. జలంతర్గామి, విమాన వాహక నౌకతో సహా ఐరోపాలో నాటో కార్యకలాపాల్లో భాగమయ్యే పలు నౌకలు, విమానాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో తన మిత్రదేశాల రక్షణ కోసం కేటాయించిన రెండు బాంబర్ గ్రూపుల్లో ఒకదాని స్థానాన్ని అమెరికా మార్చాలనుకుంటోందని సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలపై అమెరికా రక్షణశాఖ గానీ, నాటో గానీ స్పందించలేదు. నాటోకు అందించే సహకారంలో సర్దుబాటు చేసుకుంటామని గతవారం యూఎస్ ఈస్టర్న్ కమాండ్ ప్రకటించిన నేపథ్యంలో ఈ కథనాలు రావడం గమనార్హం.

హార్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన విజ్ఞప్తిని ఐరోపా దేశాలు పట్టించుకోలేదు. దాంతో ఆగ్రహానికి గురైన ఆయన.. నాటో కూటమి కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఆ కూటమి ఓ కాగితపు పులి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

# తాబేళ్లు, చేపలతో గూఢచర్యం



చైనాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. విదేశీ నిఘా సంస్థలు చైనా తీరం జలాల్లో గూఢచర్యం కోసం తాబేళ్లు, చేపలను ఉపయోగిస్తున్నాయట. వాటికి సెన్సార్లు అమర్చి సముద్రంలోకి పంపుతూ సున్నితమైన సమాచారాన్ని ఎంతో చాకచక్యంగా సేకరిస్తున్నాయట. ఈ విషయాన్ని చైనా దేశీయ భద్రతా మంత్రిత్వ శాఖ స్వయంగా వెల్లడించింది. ఆ వివరాలను తెలియజేస్తూ వీచాట్ సోషల్ మీడియాలో తాజాగా ఓ పోస్టు పెట్టింది.

ఆ పోస్టులో.. 'విదేశీ నిఘా సంస్థలు చైనా సముద్ర తీరాల రహస్యాలు, సైనిక సమాచారాన్ని దొంగిలించడానికి సెన్సార్లు అమర్చిన డిటెక్షన్ బాయ్‌లు, వేవ్ గ్లైడర్లు, సముద్ర జీవులైన తాబేళ్లు, చేపలను వాడుతున్నారు. సెన్సార్లు కలిగి ఉన్న తాబేళ్లు, చేపలను చైనాలోని పలు సముద్ర ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో గుర్తించాం. ఆ గూఢచారి తాబేళ్లు, చేపలు నిర్దిష్ట ప్రదేశాల్లో ఈదుతూ సముద్ర పర్యావరణానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సేకరిస్తున్నాయి. ఆ సమాచారం ఉపగ్రహం ద్వారా విదేశాలకు చేరుతోంది. చైనా మత్స్యకారులు, సముద్ర తీర ప్రాంత ప్రజలు ఇలాంటి వింత పరికరాలు లేదా అనుమానాస్పద జంతువులను గుర్తిస్తే వెంటనే జాతీయ భద్రతా సంస్థకు నివేదించాలి. దేశ భద్రతను కాపాడాలి' అని చైనా దేశీయ భద్రతా మంత్రిత్వ శాఖ విజ్ఞప్తి చేసింది.

# దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి 30 ఏళ్ల జైలు



దేశంలో మార్షల్ లా విధించిన కేసులో ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్న దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్‌కు మరో 30 ఏళ్ల జైలు శిక్ష పడింది. అత్యవసర పరిస్థితి విధించే పరిస్థితులు సృష్టించేందుకు, ఉద్దేశపూర్వకంగా 2024 అక్టోబర్లో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందుకు గాను ఆయనకు మరో 30ఏళ్లు జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియాలోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు. అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన 'మార్షల్ లా' విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది.

యూన్‌తో పాటు, ఆయన మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యూంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్స్ మాజీ అధిపతి కిమ్ యోంగ్-దేలను న్యాయస్థానం దోషులుగా నిర్ధరించింది. వారికి కూడా జైలు శిక్ష విధించింది. అత్యవసర పరిస్థితిని సృష్టించడం కోసం ఉత్తర కొరియాను రెచ్చగొట్టడానికి నిందితులు సైనిక చర్య అనే ముసుగును ఉపయోగించారని విమర్శించింది. అయితే చెత్త బెలూన్లను తమ దేశంపై ప్రయోగించి.. తమను రెచ్చగొట్టడానికి యత్నించిన ఉత్తర కొరియాకు తగిన బుద్ధి చెప్పడానికే మాజీ అధ్యక్షుడు ఆ దేశంలోకి డ్రోన్లను పంపారని ఆయన తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు.

ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. వారి నుంచి దేశానికి రక్షణ కల్పించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు.

ఫిఫా వరల్డ్‌కప్..

# తొలి మ్యాచ్‌లోనే మూడు రెడ్ కార్డులు

## - దక్షిణాఫ్రికాపై మెక్సికో విజయం

అట్టహాసంగా ప్రారంభమైన ఫిఫా వరల్డ్ కప్‌లో తొలి మ్యాచ్‌లో సహ అతిథ్య జట్టు మెక్సికో విజయం సాధించింది. దక్షిణాఫ్రికాపై 2-0 తేడాతో మెక్సికో గెలిచింది. అయితే, ఒకే మ్యాచ్లో మూడు రెడ్ కార్డులు ఇచ్చి ఈ మ్యాచ్‌కు రిఫరీగా పనిచేసిన విల్టన్ సాంపియో వార్తల్లోకెక్కాడు.. దక్షిణాఫ్రికా ఓడిపోవడంలో కీలక పాత్ర పోషించిన విల్టన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు ఇవ్వాలని ఈ దేశ అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియాలో అతడిపై మీమ్స్ తో నెటిజన్లు విరుచుకుపడ్డారు. ఫిఫా వరల్డ్ కప్ తొలి మ్యాచ్లోనే ఇలాంటివి చూడాల్సి రావడం బాధాకరమని పలువురు ఫ్యాన్స్ కామెంట్లు చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన ఇద్దరు ప్లేయర్లకు డైరెక్ట్ గా రెడ్‌కార్డు రావడంతో.. చాలా సమయంపాటు ఆ జట్టు తొమ్మిది మందితోనే ఆడాల్సి వచ్చింది.

**ఇదే రికార్డు..**

గత ప్రపంచ కప్ (2022)లో టోర్నీ మొత్తం కేవలం నాలుగు రెడ్ కార్డులను మాత్రమే ఇవ్వగా.. ఇప్పుడు తొలి మ్యాచ్లోనే ఏకంగా మూడు రెడ్ కార్డులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఫిఫా ప్రపంచ కప్‌లో ఒకే మ్యాచ్‌లో ఇన్ని రెడ్ కార్డులు అదీనూ ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఇవ్వడం ఇదే తొలిసారి. మెగా టోర్నీ మొదటి మ్యాచ్లోనే రికార్డు నమోదైతే.. మున్ముందు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

**ఎందుకు ఇస్తారు? వారి పరిస్థితేంటి?**

నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే ఆటగాడికి రిఫరీ రెడ్ కార్డు ఇవ్వడం సహజమే. అయితే, రెండుసార్లు ఎల్లో కార్డులు ఇచ్చినా క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తే అప్పుడు రెడ్ కార్డు చూపిస్తారు. దీంతో అప్పట్నుంచి మ్యాచ్ అయ్యేవరకూ సదరు ఆటగాడు డగౌట్‌కే పరిమితం కావాల్సిఉంటుంది. అతడికి బదులుగా మరొకరిని బరిలోకి దించే అవకాశమూ ఉండదు.

రెడ్ కార్డు ఎదుర్కొనే ప్లేయర్‌పై తర్వాత ఒక మ్యాచ్ నిషేధం విధించొచ్చు. అయితే, అది రిఫరీ నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. కానీ, మెక్సికో - దక్షిణాఫ్రికా మ్యాచ్లో మాత్రం ముగ్గురికీ ఒక్కసారి కూడా ఎల్లో కార్డు ఇవ్వకుండానే.. రెడ్ కార్డ్ చూపించడమే ఇప్పుడు విమర్శలకు దారితీసింది.



## వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రం కొంత ఆలస్యం!



దేశవాళీలో అదరగొట్టి.. ఐపీఎల్ లో దుమ్మురేపిన 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రం మరికొంత కాలం ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ 20లకు వైభవ్ సూర్యవంశీ ఎంపికైన విషయం తెలిసిందే. జాతీయ జట్టుకు ఎంపికైన అతిపిన్న వయస్కుడైన క్రికెటర్‌గా సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం వైభవ్ భారత్ ఏ జట్టుతో శ్రీలంక పర్యటనలో ఉన్నాడు. దీని తర్వాత ఐర్లాండ్, ఇంగ్లాండ్ తో టీ20లు జరగనున్నాయి. ఆ సిరీస్ ల్లో వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనే ఆసక్తి అందరిలోనూ ఉంది. అయితే, వైభవ్ టీమిండియా అరంగేట్రం కాస్త ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఐర్లాండ్‌లో అంతర్గతంగా తలెత్తిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సిరీస్ జరుగుతుందా? లేదా? అనే సందేహాలు మొదలయ్యాయి.

ఐర్లాండ్, భారత్ జట్ల మధ్య బెల్‌ఫాస్ట్ వేదికగా ఈ నెల 26, 28 తేదీల్లో రెండు టీ 20 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే, ఈ వారం ఆరంభంలో బెల్‌ఫాస్ట్‌లో జరిగిన గొడవల కారణంగా అక్కడి ఇంటర్ ప్రావిన్షియల్ టీ20 ఫెస్టివల్ రద్దైంది. ఆదివారం నుంచి జరగనున్న ఐరిష్ సీనియర్, నేషనల్ కప్ షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఇప్పటికే ఐర్లాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. మరోవైపు పరిస్థితి అదుపులోకి రాకపోతే భారత్‌తో ఐర్లాండ్ సిరీస్ నిర్వహణ ప్రమాదంలో పడినట్లే. క్రికెట్ ఐర్లాండ్ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు. మరోవైపు బీసీసీఐ కూడా ఈ అంశంపై దృష్టి పెట్టింది. ఒకవేళ పరిస్థితి మెరుగుకాకపోతే బెల్‌ఫాస్ట్ నుంచి వేరే ప్రాంతానికి మ్యాచ్ వేదికలను మార్చే అవకాశమూ లేకపోలేదు. ఇదే జరిగితే.. వైభవ్‌ను ఐర్లాండ్ లో జరిగే మ్యాచుల్లోను తొలిసారిగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో చూసే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఐర్లాండ్ తో సిరీస్ రద్దయితే మాత్రం ఇంగ్లాండ్‌లో జులై 1 నుంచి మొదలుకానున్న ఐదు టీ20ల సిరీస్‌లో మాత్రం సూర్యవంశీ తప్పకుండా బరిలోకి దిగుతాడు.

## ఫిఫా వరల్డ్‌కప్.. చెకియాపై దక్షిణ కొరియా గెలుపు



ఫిఫా ప్రపంచ కప్ లో ఆసియా జట్టు దక్షిణ కొరియా శుభారంభం చేసింది. చెకియాపై 2-1 తేడాతో విజయం సాధించింది. గ్రూప్ -ఏలో శుక్రవారం ఉదయం తలపడిన ఇరు జట్లూ గెలుపు కోసం చివరివరకూ పోరాడాయి. అయితే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేదు. కానీ, రెండో అర్ధ భాగం నుంచి ఆట రసవత్తరంగా మారింది.

రెండో సగం మొదలైన కాసేపటికే చెకియా ఆటగాడు లాడిస్లావ్ గోల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యం ఇచ్చాడు. మ్యాచ్ 59వ నిమిషంలో తొలి గోల్ నమోదైంది. మరికాసేపటికే సౌత్ కొరియా ప్లేయర్ హవాంగ్ బోయిమ్ 67వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఇక కాసేపు గోల్స్ కోసం ఇరుజట్లూ శ్రమించాయి. 80వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు ఓ హైన్ గ్యు గోల్ కొట్టి 2-1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆట అదనపు సమయంలోనూ కొరియా పట్టువిడవకుండా కాపాడుకుంది. చెకియాను గోల్ కొట్టనీయకుండా కట్టడి చేయగలిగింది. ఆటలో ఎక్కువ భాగం బంతిపై నియంత్రణ దక్షిణ కొరియాకే ఉంది. చెకియా 16 పొరపాట్లు చేయగా.. దక్షిణ కొరియా 9 మాత్రమే చేసింది.

## అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ మామ వీడ్కోలు



న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ జరుగుతుండగానే అతడు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 35 ఏళ్ల కేన్ కివీస్ తరపున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్లో 19వేలకు పైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. దాదాపు ఎనిమిదేళ్లపాటు (2016-24) న్యూజిలాండ్‌కు సారథ్యం వహించాడు. రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు తన జట్టును చేర్చాడు. తొలి ఐసీసీ టెస్టు చాంపియన్ షిప్ విజేతగా కివీస్ నిలవడంలో కేన్ కెప్టెన్సీదే కీలక పాత్ర.

2010లో అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది టీ20లకు వీడ్కోలు పలికాడు. ఇప్పుడు మిగతా రెండు ఫార్మాట్లకూ గుడ్‌బై చెప్పేశాడు.ఆటకు వీడ్కోలు పలకడంపై గత కొన్ని రోజులుగా ఆలోచిస్తూనే ఉన్నా. ఇప్పుడు ఇదే సరైన సమయంగా భావిస్తున్నా. అంతర్జాతీయ క్రికెట్ పట్ల నాకు ఎప్పుడూ బలమైన తపన, ఆసక్తి ఉండేవి. న్యూజిలాండ్ తరపున ఆడిన ప్రతి మ్యాచ్లోనూ నా సర్వశక్తులూ ఒడ్డా. ఆ భావనే నన్ను గర్వపడేలా చేస్తోంది. ఇలాంటి గొప్ప జట్టుకు నాయకత్వం వహించడమూ ఆనందంగా ఉంది. నా మనసులో ఎప్పుడూ జట్టుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇన్నేళ్లూ జట్టులో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నానని కేన్ తెలిపాడు.

**సన్‌రైజర్స్‌తో అనుబంధం..**

కేవలం కివీస్ ప్లేయర్ గానే కాదు.. తెలుగు క్రికెట్ అభిమానులకూ కేన్ విలియమ్సన్ సుపరిచితుడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గతంలో నాయకత్వం వహించాడు. అతడి సారథ్యంలో సన్‌రైజర్స్ ఫైనల్ వరకు వెళ్లింది. 2016లో ఛాంపియన్‌గా అవతరించిన సన్‌రైజర్స్ జట్టులోనూ అతడు సభ్యుడే. దీంతో తెలుగు రాష్ట్రాల అభిమానులకు 'కేన్ మామ'గా మారిపోయాడు. ఐపీఎల్లో 79 మ్యాచులు ఆడిన కేన్ 2,128 పరుగులు

## ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌కు సింధు




తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో తైపీకి చెందిన చెన్ సు యుపై 21-6, 21-9 తేడాతో పీవీ సింధు విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన పోరులో కేవలం 27 నిమిషాల్లోనే చెన్‌ను సింధు చిత్తు చేయడం గమనార్హం. సింధుకు చెన్ ఏమాత్రం ప్రతిఘటన ఇవ్వలేకపోయింది. సెమీస్‌లో జపాన్‌కు చెందిన యమగుచితో సింధు తలపడనుంది. వీరిద్దరిలో సింధు 15-13 ఆధిక్యంలో ఉంది.

చైతన్య రథం
సినిమా
శనివారం 13 జూన్ 2026 IX

# అనిల్ రావిపూడి స్టైలే వేరు!

**మొదలుకాని సినిమాకు.. వింతైన ప్రమోషన్**




సినిమాపై జనంలో ఆసక్తి కలిగించటంలో ప్రమోషన్లదే కీలకపాత్ర. ఈ విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి స్టైలే వేరు. ప్రమోషన్స్‌లో అనిల్ రావిపూడి ప్రమోషన్స్ వేరయా.. అని ఇండస్ట్రీలో టాక్. ఆయన సినిమాలను జనాల్లోకి తీసుకెళ్లే విధానం సూపర్. ఆయన తీసే ప్రతి సినిమా ప్రచారం కొత్తగానే ఉంటుంది. అసలు ప్రమోషన్స్‌కే రాని నయనతారతో కూడా ఓ వీడియో చేయించి వైరల్ చేసిన ఘనత అనిల్ రావిపూడిది. ప్రస్తుతం ఆయన వెంకటేశ్–కల్యాణ్‌రామ్ కీలక పాత్రధారులుగా ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇంకా సినిమా షూటింగ్ మొదలుకాక ముందే ప్రచారం మొదలెట్టేశారు అనిల్. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ విషయాన్ని చెబుతూ చమత్కారం చేశారు అనిల్ రావిపూడి. జంధ్యాల 'వివాహ భోజనంబు' సినిమాలో బ్రహ్మానందాన్ని ఇసుకలో పూడ్చి.. హైదరాబాద్.. సికింద్రాబాద్.. అదిలాబాద్ అంటూ సుత్తి వీరభద్రరావు చేసిన కామెడీ సీన్ ను తన కొత్త సినిమా కోసం అనిల్ రావిపూడి రీ క్రియేట్ చేశారు. ఇక్కడ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌ను పీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి సినిమా పాటలు ఎలా ఉండాలో చెబుతూ 'క్లాసు పాట.. మాసు పాట.. ఎమోషనల్ పాట, మెలోడీ పాట...డీజే పాట.. బీజీఎమ్ పాట' అంటూ ఓ వీడియో చేశారు. ట్యూన్ కట్టాలంటే హార్మోనీ ఉంటే సరిపోదు.. రెండు చేతులు.. పది వేళ్ళు కూడా కావాలి.. కనీసం చేతులైన బయటకు తీయండి మహాప్రభో' అంటూ జీవీ చెప్పడం, లిరిక్ రైటర్ గురించి అడిగితే 'రెండు రోజుల ముందే అతడిని పాతిపెట్టా' అంటూ అనంత్ శ్రీరామ్‌ను చూపించడం నవ్వుల పువ్వులు పూయిస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. దీనిని చూసిన అభిమానులు, నెటిజన్లు 'ప్రమోషన్స్‌లో నిన్ను కొట్టేవాడు లేడయ్యా అనిల్' అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# నివేదా పదేళ్ల సెలబ్రేషన్స్



మెగాస్టార్ చిరంజీవి,మాస్‌డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న 'మెగా 158'(వర్కింగ్ టైటిల్) ఇటీవలే మొదటి షెడ్యూల్‌షూట్‌ని పూర్తి చేసుకుంది.ఈషెడ్యూల్‌కు సంబంధించి ఓవీడియో వైరల్ అవుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె.నారాయణ అత్యంత ప్రతి ష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా.. రీసెంట్‌గా తమిళనాడులోని పొల్లాచ్చిలో ఒక భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ఈ షెడ్యూల్ ముగింపు సందర్భంగా సెట్స్‌లో ఒక బ్యూటిఫుల్ మూ మెంట్ చోటుచేసుకుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తు న్న టాలెంటెడ్ బ్యూటీ నివేతా పేతురాజ్ సినీ ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టి 10ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ గ్రాండ్‌గా కేక్ కట్‌చేయించి సెలబ్రేట్ చేసింది.ఈ సెలబ్రేష న్స్‌కు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.అందులో నివేతా పేతురాజ్ ట్రెడిషనల్ చీరకట్టులో, తలలో పూలతో చాలాపద్ధతిగా కనిపిస్తుండగా.. పక్కనే 'మెగా 158'డైరెక్టర్ బాబీ కూడా ఉన్నారు. షూటింగ్ సెట్‌లోని సిబ్బంది మొత్తంనివేతాకు చప్పట్లతో శుభాకాంక్షలు తెలపగా..ఆమె కేక్ కట్‌చేసి అందరికీ తినిపించారు. బ్యాక్ గ్రౌండ్ లో పల్లెటూరి వాతావరణం, ఆ బిల్డింగ్ సెటప్ చూస్తుంటే పొల్లాచ్చి షెడ్యూల్‌లో చాలా కీలకమైన ఫ్యామిలీ, విలేజ్ డ్రామా సీన్స్ చిత్రీకరించినట్లు స్పష్టమవుతోంది.

# నన్ను భరించే సామర్థ్యం వాళ్లకు లేదు..




జేమ్స్ బాండ్ ఫ్రాంచైజీలో మూవీ చేయాలన్న ఆసక్తితో రెండుసార్లు ప్రయత్నించినా తనకు తిరస్కరణే ఎదురైందని ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్ బర్గ్ చెప్పారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయనను '007" చిత్రానికి దర్శకత్వం వహించకపోవడంవల్ల ఏమైనా బాధ ఉందా.. అని విలేకరి ప్రశ్నించగా.. దానికి స్పీల్బర్గ్ సమాధానం ఇచ్చారు. అవును! బాండ్ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం నాకు ఇవ్వకపోవడం బాధ కలిగించింది. నేను దర్శకత్వం వహించిన 'జాస్' విజయం సాధించిన తర్వాత బాండ్ ఫ్రాంచైజీ మూవీ నిర్మాత కబ్బీ బ్రోకలీతో మాట్లాడాను. 'డాక్టర్ నో' సినిమా చూసినప్పటి నుంచే బాండ్ మూవీకి పనిచేయాలన్న నా ఆసక్తిని ఆయనకు తెలియజేశా. కానీ, ఎందుకో ఆయన నా దర్శకత్వం పట్ల ఆసక్తి చూపలేదు. అందుకు తగిన కారణం కూడా చెప్పలేదు. ఆ తర్వాత నా దర్శకత్వంలో 'క్లోజ్ ఎన్కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్' విడుదలయ్యాక నేను మరోసారి నా ఆసక్తిని ఆయన ముందు వ్యక్తపరిచాను. అదే సమయంలో 'మూన్‌రేకర్ చిత్రంలోని ఒక సన్నివేశం కోసం నా మూవీలోని ఐదు ఆడియో క్లిప్‌లను ఉపయోగించుకుంటానంటూ బ్రోకలీ నా అనుమతి కోరారు. తర్వాతి బాండ్ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశమిస్తే, ఆ ఐదు ఆడియో క్లిప్‌లను వినియోగించుకునే అనుమతి ఇస్తానన్నాను. కానీ, ఆయన అంగీకరించలేదు. అయినప్పటికీ, నేను ఆ ఐదు ఆడియోలు ఇచ్చేశానని స్పీల్ బర్గ్ గుర్తుచేసుకున్నారు. అయితే, ఆ అవకాశం చేజారిపోవడంవల్లే తరువాతి కాలంలో స్టీల్‌బర్గ్.. ఇండియానా జోన్స్' వంటి యాక్షన్ అడ్వెంచర్ ఫ్రాంచైజీ చేయడానికి బాటలు పడ్డాయి. ఆ సిరీస్‌లో స్టీవెన్ స్పీల్బర్గ్ తీసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించాయి. ఇప్పుడు బాండ్ సినిమా చేస్తారా? అని అడగ్గా.. 'వాళ్లకు నన్ను భరించే సామర్థ్యం లేదు' అని స్పీల్‌బర్గ్ నవ్వుతూ బదులిచ్చారు.

# 'చాందినీ బార్ 2'లో కత్రినా!



నాజూకు అందాలతో కుర్రకారును కిర్రెక్కించిన ముద్దుగుమ్మ కత్రినా కైఫ్ తెరపై కనిపించి ఏడాదిన్నర అవుతోంది. చివరిసారిగా ఆమె 2024 డిసెంబరులో విడుదలైన 'మేరీ క్రిస్మస్'తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. నటుడు విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకున్న కత్రినా.. గతేడాది సెప్టెంబరులో తల్లిని కాబోతున్నట్లు ప్రకటించి అభిమానులకు శుభవార్తచెప్పింది. మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు కొన్నాళ్లపాటు నటనకు విరామం ఇస్తున్నట్లు వెల్లడించింది. అప్పటి నుంచి ఆమె కొత్త సినిమాకు సంబంధించిన కబుర్లేవీ వినిపించలేదు.అయితేనేం..సినిమాలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. 'స్టార్స్ ఇండి యా లవ్' పేరిట ఓసంస్థ నిర్వహించిన సర్వేలో 2025 కిగానూ టాప్ 5లో చోటుదక్కించుకొని.. అలియా భట్, దీపికా పదుకొణె,శ్రద్ధాకపూర్, కృతి సనన్‌లసరసన కత్రినా నిలిచింది.మరో వైపు, కత్రినా కమ్‌బ్యాక్ ఎప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు కిక్‌ఇచ్చే వార్త ఒకటి బాలీవుడ్ సర్కిల్లో చక్కర్లు కొడుతోంది.

అదేంటంటే..2001లో టబు ప్రధాన పాత్రలో నటించిన 'చాందినీ బార్' సీక్వెల్లో కత్రినా నటించబోతోందట. వాస్తవిక ప్రపంచంలోని వెలుగునీడలను వెండితెరపై ఆవిష్కరిస్తూ ప్రత్యేకగుర్తింపు తెచ్చుకున్న మధుర్ భండార్కర్ 'చాందినీ బార్‌ను తెరకెక్కించారు. ఆచిత్రం విమర్శకుల ప్రశంసల్ని సైతం అందుకోవడంతో పాటు గత్యంతరంలేని పరిస్థితుల్లో బార్ డ్యాన్సర్‌గా మారినపాత్రలో టబునటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దానికి సీక్వెల్‌ను తెరకెక్కిం చబోతున్నట్లు గతేడాది అధికారిక ప్రకటనవచ్చింది.'సెక్షన్ 375' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న అజయ్ బహల్ 'చాందినీ బార్ 2'కు దర్శకుడిగా వ్యవహరించనున్నారు. అయితే, ప్రధాన పాత్రలో ఎవరు నటించబోతున్నారన్న విషయాన్ని నిర్మాణ సంస్థ ఇంకా ప్రకటించలేదు.ఇప్పుడు ఆఅవకాశం కత్రినాను వరించినట్లు బాలీవుడ్ వర్గాల్లో టాక్. ఇందులో టబుకూడా నటించబోతున్నట్లు తెలుస్తోంది.అదే నిజమైతే కత్రినా అభిమానుల ఎదురుచూపులు ఫలించినట్లే!

# క్రేజీ కాంబినేషన్..

టాలీవుడ్‌లో కాంబినేషన్‌కు మంచి క్రేజ్ ఉంటుంది. ఇప్పుడు అలాంటి క్రేజీ కాంబినేషన్ ఒకటి సెట్ అయింది.నిర్మాత బన్నీ వాస్, దర్శకుడు సుకుమార్ కలిసి ప్రియదర్శి హీరోగా ఓ సినిమాను నిర్మించబోతున్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ సినిమాకి దర్శకుడు ఎవరు? ఇతర నటీ నటులు, సాంకేతిక నిపుణులు ఎవరు? అనేది త్వరలో వెల్లడించనున్నారు. ఈ ఇంట్రెస్టింగ్ కాంబినేషన్లో సినిమా అందరిలో ఆసక్తి కలిగిస్తోంది. బన్నీ వాస్ ప్రొడ్యూసర్‌గా, డిస్ట్రిబ్యూటర్‌గా సూపర్ హిట్ సినిమాలు చేస్తున్నారు. దర్శకుడు సుకుమార్ పుష్ప 2 వంటి పాన్ వరల్డ్ బ్లాక్ బస్టర్ తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో మూవీ చేయడానికి సన్నాహాల్లో ఉన్నారు.



# ప్రజలు కోరుకుంటే రాజకీయాల్లోకి..

ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు, నటుడు రాఘవ లారెన్స్ కీలక ప్రకటన చేశారు. తాను రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని అనుకుంటున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం ప్రజల అభిప్రాయాన్ని కోరారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో శుక్రవారం వీడియో విడుదల చేశారు. ప్రజలు, అభిమానులు ఆమోదిస్తే తాను రాజకీయ ప్రయాణం ప్రారంభిస్తానని, లేదంటే ఈ ఆలోచనను విరమించుకుంటానని లారెన్స్ పేర్కొన్నారు. లారెన్స్ రాజకీయాల్లోకి వస్తారని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. తమిళనాడులోని తిరుచ్చి ఈస్ట్ ఉప ఎన్నికలో ఆయన పోటీ చేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై లారెన్స్ ఓ పోస్ట్ చేశారు. "ఫలితం ఆశించకుండా నిజాయతీగా పనిచేయాలనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతా, రాజకీయాల్లోకి రావాలని నేను ఏనాడూ అనుకోలేదు. సీటు కావాలి, డబ్బు సంపాదించాలనే ఆలోచన లేదు. నాకు అత్యంత సన్నిహితులెవరైనా రాజకీయాల్లోకి చేరితే వారి పక్కన నిలబడి సమాజానికి ఇప్పుడు చేస్తున్న దానికంటే మరింత ఎక్కువ సేవ చేయాలనుకున్నా. కానీ, కొన్ని పరిస్థితులు, సంఘటనలు రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనను నాలో కలిగించాయి" అని ఆయన రాసుకొచ్చారు. తాను రాజకీయాల్లోకి వెళ్తానని చెబితే తన తల్లి అంగీకరించారని తెలిపారు. తన జీవిత ప్రయాణంలో ఎదురైన కొన్ని సంఘటనలను పంచుకుని.. వాటి నుంచే రాజకీయాలపై స్ఫూర్తి పొందినట్లు తెలిపారు. "నా నిర్ణయం సరైందో, కాదో చెప్పాలని మిమ్మల్ని (ప్రజలను) కోరుతున్నా. మీరు అంగీకరిస్తే మీ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వస్తా. ఎప్పుడు ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తానో.. ఏ పార్టీలో చేరుతానో సమయం చూసుకుని ప్రకటిస్తా. మీరు వద్దంటే ఈ ఆలోచన మానుకుని.. ఎప్పటిలాగే సమాజం కోసం నిస్వార్థంగా నా సేవలను కొనసాగిస్తా" అని లారెన్స్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఈ ఏడాది జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత, సీఎం విజయ్ రెండు స్థానాల్లో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఫలితాల అనంతరం పెరంబూర్ ఎమ్మెల్యేగా కొనసాగిన విజయ్.. తిరుచ్చి ఈస్ట్ స్థానాన్ని వదులుకున్నారు.



దీంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే లారెన్స్ అక్కడినుంచి పోటీ చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆయన టీవీకేలో చేరుతారనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. విజయ్ తో లారెన్స్‌లకు మంచి అనుబంధం ఉన్న సంగతి తెలిసిందే.